# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 14 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 221 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## భారతీయ శాస్త్రవేత్తకు డిరాక్ అవార్డు




5

## 80 అంకె ఆకారం వేసి

జాతీయ జెండాకు ప్రత్యేక వందనం చేసిన విద్యార్థులు



2

### మనం 10వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మా ఈ పదేండ్ల ప్రస్థానంలో ఎన్నో అడ్డంకులు.. ఎన్నెన్నో అవరోధాలు.. ఏ ఆశయం కోసమైతే మనం పురుడుపోసుకుందో ఆ లక్ష్యసాధనకై అన్నింటినీ భరించాం.. అధిగమించాం.. ప్రయాణాన్ని కొనసాగించాం. నేటితో 10 సంవత్సరాలు పూర్తి చేసుకుని సగర్వంగా 11వ వసంతంలోకి అడుగుపెడుతున్నాం. మాకు అండగా నిలబడిన మా మనం కుటుంబ సభ్యులకు (జర్నలిస్టులు, ఉద్యోగ సిబ్బంది) హృదయపూర్వక అభినందనలు.. మనం ను ఇంటిపేరుగా మార్చుకొని , అన్నింటికీ తట్టుకొని మీతోనే మా ప్రయాణం అంటూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మాతో కలిసి నడుస్తున్న మా జర్నలిస్టు సోదరులే మా బలం. పత్రిక ప్రారంభంలో ఏ మాట అయితే ఇచ్చామో అందుకు నేటికీ కట్టుబడి ఉన్నాం... ఆ లక్ష్యాన్ని సాధిస్తాం... చరిత్ర సృష్టిస్తాం.

మనం 10 వ వార్షికోత్సవ శుభ సందర్భాన మా వెన్నంటి నిలిచిన పాఠకులు ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు, మా మనం సైన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

– మేనేజ్‌మెంట్

# రాజధానికి రాజమార్గం

# సీడ్ యాక్సెస్

## అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

- ఐదు కాన్సెప్టులతో దేశం మెచ్చిన రాజధానిగా అమరావతి
- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన



అమరావతికి రాజమార్గం..
అద్భుతం చంద్రన్న విజన్!

2



గుంటూరు/అమరావతి, ఆగస్టు 13 (మనం న్యూస్ ప్రతినిధి): సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ - మంగళగిరి - గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు.వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.రాయపూడి నుంచి వెంకటపాలెం- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది.స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్టైంది.మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా

...మిగతా 2లో



### నా ప్రసంగం తర్వాత
## వేదికను శుద్ధి చేసిండ్రు

ఇది బీజేపీ పనే అని రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే ఆరోపణలు

ఢిల్లీ, ఆగష్టు 13: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరిరోజున ఎగువ సభలో గందరగోళం నెలకొంది. ఉత్తరాఖండ్ ర్యాలీలో భాగంగా తన ప్రసంగం తర్వాత వేదిక వద్ద శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై వెంటనే కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. అదొక దురదృష్టకర ఘటన అని, అటువంటి కార్యక్రమాలను బీజేపీ ఏమాత్రం సమర్థించబోదని స్పష్టం చేశారు. ఇటీవల ఉత్తరాఖండ్ లోని

...మిగతా 2లో

## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ
## 'అక్రమార్కుల కమిషన్'గా మారింది

### మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు,ఆగస్టు 13 (మనం ప్రతినిధి): వైసీపీ ఐదేళ్ల హయాంలో ఏపీపీఎస్సీ అంటే 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్' లా కాకుండా 'అక్రమార్కులకు ఆలవాలమైన కమిషన్' గా మారిపోయిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల స్కామ్, కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన 'మెగా డీఎస్సీ' తదితర అంశాలపై మీడియాకు సుదీర్ఘ వివరణ ఇచ్చారు. గత వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల అక్రమాలపై 'సిట్' అందించిన 132 పేజీల నివేదిక ఆ పార్టీ అరాచక పాలనకు, పాపాలకు నిలువెత్తు సాక్ష్యమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా మూడుసార్లు రీవాల్యుయేషన్ చేసి, 95 శాతం జవాబు పత్రాలపై వైట్ నర్లు రుద్ది,

...మిగతా 2లో

## లోక్‌సభలో తొలిసారి
## వందేమాతరం ఆలాపన

- ఆరు చరణాల పూర్తి గేయాన్ని పాడిన ఎంపీలు
- గొంతు కలిపిన ప్రధాని మోడీ




ఢిల్లీ, ఆగష్టు 13: పార్లమెంటు చరిత్రలో తొలిసారిగా జాతీయ గేయం 'వందేమాతరం'తో లోక్ సభకార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గురువారం ప్రధాని మోడీతో సహా సభ్యులంతా సభకు హాజరై వందేమాతరం ఆరు చరణాలను ఆలపించారు. అనంతరం

...మిగతా 2లో

## మానవ-వన్యప్రాణి సంఘర్షణ లేని జీవనం అత్యున్నతమైనది

- ఆంధ్రప్రదేశ్ ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం
- కుంకీ ఏనుగుల రాకతో అద్భుత ఫలితాలు
- ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ లక్ష్యం
- ప్రపంచ ఏనుగుల దినోత్సవ సదస్సులో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



2

## ఎర్రకోట బాంబు పేలుడు
## అల్-ఖైదా పనే



5

### వివాదాన్ని ఇక ముగించండిమాల్యా, ఎస్బీఐకి బాంబే హైకోర్టు సూచన

5

## వందేమాతరం స్ఫూర్తిని చాటుతూ..
## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేద్దాం

### బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

మార్కాపురం,ఆగష్టు,13,(మనం న్యూస్): వందేమాతరం స్ఫూర్తిని చాటుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఆగస్టు 17 వరకు నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి,

...మిగతా 2లో



### ఆసుపత్రి అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తిచేయాలి

పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష



6

## రూపాయికే ఉచిత సిమ్

### ఫ్రీడమ్ ప్లాన్‌ను మళ్లీ ప్రకటించిన బీఎస్ఎన్ఎల్

హైదరాబాద్, ఆగష్టు 13: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొత్త వినియోగదారుల కోసం తన ఫ్రీడమ్ ప్లాన్ను మళ్లీ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రూ.1కే ఉచిత సిమ్మును అందిస్తుంది. ఫస్ట్ రీఛార్జి ప్లాన్

...మిగతా 2లో







## లష్కరే తోయిబా చీఫ్‌కు నేను దాసుడిని

- పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్

ఇస్లామాబాద్, ఆగష్టు 13: పాకిస్థాన్‌లోని రాజకీయ నేతలు, ఉగ్రవాదుల మధ్య సంబంధాలు మరోసారి బహిర్గతమయ్యాయి. లష్కరే తయ్యిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు తాను దాసుడిని అంటూ బహిరంగ వేదికపై మాజీ మంత్రి షేక్ రషీద్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ఆయన మాట్లాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అప్పుడు ఆ వేదికపై లష్కరే కమాండర్, ఇతర ఉగ్రసంస్థల సభ్యులు కూడా ఉన్నారు. "నేను హఫీజ్ సయీద్ దాసుడను. నా ఫోన్‌లో హఫీజ్ ఫోన్ నంబర్ దొరకడం వల్లే అమెరికా నుంచి బహిష్కరించారు'' అని రషీద్ మాట్లాడారు. అలాగే సయీద్‌కు తన మద్దతు ప్రకటించారు. అంతటితో ఆగకుండా భారత్‌పై అకారణంగా విషం కక్కారు. రషీద్ 2020 నుంచి 2022 మధ్య ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో హోంశాఖ బాధ్యతలు నిర్వహించారు. భారత్‌లో ఉగ్రకార్యకలాపాలకు

...మిగతా 2లో

### బ్రిటన్ ప్రధాని నిపుణ సలహాదారుగా గౌతమ్ రంగరాజన్



లండన్, ఆగష్టు 13: భారతీయ మూలాలున్న ప్రముఖ వ్యూహకర్త, మీడియా ఎగ్జిక్యూటివ్ గౌతమ్ రంగరాజన్‌ను బ్రిటిష్ ప్రధాన మంత్రి ఆండీ బర్న్‌హామ్ తన కార్యాలయంలోని కీలక పదవిలో నియమించారు. వివిధ వ్యవస్థల ప్రణాళిక, పనితీరుపై నిపుణ సలహాదారుగా రంగరాజన్ వ్యవహరించనున్నారు. ఇది కొత్తగా సృష్టించిన పదవి. బీబీసీ మాజీ వ్యూహకర్త, సంగీతకారుడు అయిన రంగరాజన్ వారంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

### యుద్ధనౌక నుంచి సముద్రంలోకి దూకి
## అమెరికా నావికుల ఆత్మహత్య!



వాషింగ్టన్, ఆగష్టు 13: పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచ దేశాలను ఇంధన సంక్షోభంలోకి నెడితే.. యుద్ధరంగంలోని సైనికులకు మానసిక క్షోభ మిగుల్చుతున్నట్లు కనిపిస్తోంది. గల్ఫ్ జలాల్లో కొన్ని నెలలపాటు యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తిస్తోన్న సైనికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆహారం, మంచినీటి కొరత, అపరిశుభ్ర మరుగుదొడ్లు వారిని కుంగదీస్తున్నాయి. దాంతో యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌకలోని అమెరికా నావికులు సముద్రంలోకి దూకి ఆత్మహత్యకు యత్నించారని అమెరికా పత్రిక మిలిటరీ టైమ్స్ కథనం పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అమెరికా పలు యుద్ధ నౌకలను పశ్చిమాసియా జలాల్లో మోహరించిన సంగతి తెలిసిందే. అబ్రహం లింకన్‌లో ఐదు వేలమంది నావికులు, మెరైన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రికార్డు స్థాయిలో 250 రోజులుగా అది సముద్రజలాల్లోనే ఉంది. సుదీర్ఘ మోహరింపు, కఠిన పరిస్థితులు, మానసిక ఒత్తిడి సిబ్బందిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని గతంలోనే వార్తలు వచ్చాయి. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అటకెక్కడంతో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి కొనసాగుతోంది. మరోవైపు అబ్రహం లింకన్ సహా ఇతర యుద్ధ నౌకలను ఉపయోగించి ఇరాన్ ఓడరేవులను యూఎస్ మరోసారి దిగ్బంధించింది. ఈ పరిస్థితులతో వారి మానసిక స్థితిని మరింత దిగజారినట్లు కనిపిస్తోంది. అలాగే తమవారిని మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామో

...మిగతా 2లో

# రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళిక చేశారు.దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది.స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు.అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.'రాష్ట్రాభివృద్ధి విజన్కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత రాష్ట్రం నష్ట పోయింది.రాజధాని కూడా లేకుండా పోయింది.25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం.విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు.రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది.గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు.ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం.కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో



రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు.అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష.అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం.'అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాజధాని నిర్మాణంలో ఐదు కాన్సెప్టులు**

'అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది.నగర నిర్మాణంలో ఇది ప్రారంభం మాత్రమే. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్టు అవుతుంది.అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్టెక్ క్యాపిటల్ గా దీనిని తయారు చేస్తున్నాం.

ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. నో పోల్స్, బ్లూ,గ్రీన్,గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది.ఏఐ,క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్ 5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది

అమరావతి, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు,విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయి. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు. 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఇక అమరావతి అన్ స్టాపబుల్. రాజధాని లో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు.ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దుష్టమైన లక్ష్యాలను పెట్టుకుంటున్నాం'. అని సీఎం అన్నారు.

జెండా- సాధించాల్సిన అజెండాతో సంకల్పం

'2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం.ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా,మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి,దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందన్న అంశాన్ని అంతా మర్చిపోతున్నాం. జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయటం ముఖ్యం.రైతులు, విద్యార్థులు,కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ తమ స్థాయిల్లో కృషి చేయాలి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి.

మండల,అసెంబ్లీ నియోజకవర్గాలు,జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి.ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి.ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలి.అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి.'అని సీఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ,నాదెండ్ల మనోహర్,ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్,కొలికపూడి శ్రీనివాస్,ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం పరిశీలించారు.

## లోక్‌సభలో తొలిసారి వందేమాతరం ఆలాపన

### ఆరు చరణాల పూర్తి గేయాన్ని పాడిన ఎంపీలు

### గొంతు కలిపిన ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

స్పీకర్ ఓం బిర్లా లోక్సభను నిరవధికంగా వాయిదా వేశారు. వందేమాతరాన్ని అవమానిస్తే క్రిమినల్ చర్యలు తీసుకునే బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ చట్టం ప్రకారం.. వందేమాతరం పాడేటప్పుడు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటారు. దీంతో జాతీయ గీతం జనగణమనకు ఉన్న రక్షణ వందేమాతరానికీ లభించింది.

## 80 అంకె ఆకారంలో కూచుని

**తిరుపతి, ఆగష్టు 13:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తిరుపతిలోని ముత్యాల రెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, మరి కొంతమంది విద్యార్థులు 80 ఆకారంలో కూర్చొని పతాకానికి నేలను తాకుతూ నమస్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు సురేష్ అధ్యక్షతన విద్యార్థులు జాతీయ పతాకాన్ని గౌరవిస్తూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. అంకెల రూపంలో విద్యార్థుల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

## వందేమాతరం స్ఫూర్తిని చాటుతూ.. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సూచించారు. త్రివర్ణ పతాకం కేవలం ఒక జెండా మాత్రమే కాదని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు 'వందేమాతరం' స్ఫూర్తితో దేశం పట్ల గౌరవం, జాతీయ ఐక్యత, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరిలో మరింత బలోపేతం చేసుకోవాలని ఆయన అన్నారు. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చేసి, దేశభక్తి భావాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు. వందేమాతరం నినాదంతో దేశ సమైక్యతను చాటుతూ.. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ.. గర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# అద్భుతం చంద్రన్న విజన్!

**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో గురువారం ఒక సరికొత్త మైలురాయి నమోదైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా మార్చే దిశగా అత్యంత కీలకమైన ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి, ప్రజాప్రతినిధుల నివాస సముదాయాలను ఘనంగా ప్రారంభించారు.**

**అమరావతి, ఆగస్టు 13 (మనం న్యూస్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ ప్రక్రియలో గురువారం అత్యంత కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఎన్నో అడ్డంకులను దాటుకుని, రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే 22 కిలోమీటర్ల ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డును, ఉండవల్లి వద్ద బకింగ్హామ్ కెనాల్ నిర్మించిన ఆధునిక స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. దీంతో పాటు రాయపూడి గ్రామం వద్ద నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస టవర్ల తాళాలను అధికారికంగా సాధారణ పరిపాలన శాఖకు అప్పగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఐదేళ్ల నిరాదరణను తరిమికొట్టి అమరావతి మళ్లీ సగర్వంగా నిలబడుతోందని, 2028 నాటికి అమరావతి ఫేజ్-1ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.రూ. 1,520 కోట్ల వ్యయంతో పూర్తయిన 22 కిలోమీటర్ల మేర సాగే ఈ తొమ్మిది వరుసల రహదారిని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన అత్యంత పవర్ఫుల్ స్పీచ్ ఇచ్చారు.

అమరావతి నిర్మాణమే రాష్ట్రాభివృద్ధి విజన్ అని, అమరావతి నిర్మాణం 'అన్స్టాపబుల్' అన్నారు. సీడ్ యాక్సెస్ రహదారిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు, ఇది రాజధానికి అద్భుతమైన రాజమార్గం అన్నారు. 2028 నాటికి ఫేజ్-1 పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఇది మాయాజాలం కాదు.. వాస్తవం! అమరావతిని 'క్వాంటం, ఏ ఐ వ్యాలీ'గా మారుస్తామని చంద్రబాబు చెప్పారు.

## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ 'అక్రమార్కుల కమిషన్'గా మారింది

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తూ తమ వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని మండిపడ్డారు. పదో తరగతి, ఇంటర్ చదివిన సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలను దిద్దించి ఏపీపీఎస్సీ పవిత్రతను దెబ్బతీశారని ధ్వజమెత్తారు.



డీఎస్సీలో ఉద్యోగం రాని నిరుద్యోగులు నిరాశ చెందవద్దని, ఈ ఏడాది అక్టోబర్లోనే మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రికార్డు స్థాయిలో కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా వేయని వైసీపీ నాయకులు చేసే విషప్రచారాలను నిరుద్యోగులు నమ్మవద్దని, రాబోయే డీఎస్సీకి శ్రద్ధగా సిద్ధం కావాలని హితవు చెప్పారు. ప్రభుత్వంపై బురదజల్లే దొంగ నాటకాలు మాని, ధైర్యముంటే శాసనసభకు వచ్చి డీఎస్సీపై చర్చించాలని, సమాధానం చెప్పేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విప్లవాత్మక మార్పులతో వేలాది ఉద్యోగాలు ఇస్తుంటే, ఆయన రాజీనామా డిమాండ్ చేయడం గురివింద గింజ సామెతను గుర్తు చేస్తోందన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని డబల్ ఇంజిన్ సర్కార్తో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.చనిపోయిన వారిని పరామర్శించకుండా ఆస్తుల విధ్వంసమే ధ్యేయంగా రాజకీయం చేస్తున్న వైసీపీకి రాబోయే రోజుల్లో ప్రజలు సింగిల్ డిజిట్కే పరిమితం చేయడం ఖాయమని హెచ్చరించారు.

## లష్కరే తోయిబా చీఫ్‌కు నేను దాసుడిని

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడేవారి గురించి రషీద్ ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. 26/11 ముంబయి దాడికి పాల్పడిన అజ్మల్ కసబ్ చిరునామాను భారత్‌కు చెప్పింది మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అని గతంలో వ్యాఖ్యలు చేశారు. ఇక, హఫీజ్‌ను ఐరాస ఇప్పటికే అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నా ప్రసంగం తర్వాత వేదికను శుద్ధి చేసింద్రు

(మొదటి పేజీ తరువాయి)

రామ్ లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. రెండురోజుల తర్వాత ఒక గ్రూప్ అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

దీంతో గురువారం రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే.. ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. 'నేను పాల్గొన్న ర్యాలీలో లక్షల మంది హాజరయ్యారు. నేను ఏ వర్గాన్ని గానీ, మతాన్ని గానీ ప్రస్తావించలేదు. ప్రజల సమస్యల గురించి మాత్రమే మాట్లాడాను. కానీ ప్రసంగం తర్వాత కొందరు అడిగారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిస్థితా..? ఇది బీజేపీ కార్యకర్తల పనే' అని తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఖర్గేకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. రాజ్యసభ ఛైర్మన్ కలుగజేసుకొని వారికి సర్దిచెప్పారు. ఈ ప్రపంచంలో అంటరానితనానికి మించిన పాపం లేదన్నారు. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదని, వారిని పట్టుకోవాలని ఛైర్మన్ సూచించారు.

అయితే, బీజేపీ కార్యకర్తల పనంటూ ఖర్గే చేసిన ఆరోపణలను జేపీ నడ్డా ఖండించారు. ఆ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'బీజేపీ చేసిందని పదేపదే చెప్పొద్దు. మా పార్టీ అలాంటి వాటిని ప్రోత్సహించదు. ఆ ఘటనపై దర్యాప్తు జరిపిస్తాం'' అని హామీ ఇచ్చారు.

## అమెరికా నావికుల ఆత్మహత్య!

(మొదటి పేజీ తరువాయి)

తెలియని గందరగోళం నావికులు సముద్రంలో దూకడానికి కారణమై ఉంటుందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం ఆరుగురు నావికులు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఈ కథనాలను అమెరికా నేవీ అధికారులు తోసిపుచ్చారు.

**ట్రంప్ పదవిలో ఉన్నంతకాలం యుద్ధం..?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉన్నంతకాలం యుద్ధం కొనసాగుతుందా..? ఐఆర్జీసీ చేసిన హెచ్చరిక ఇదే విషయాన్ని వెల్లడిచేస్తోంది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా అమెరికాతో యుద్ధాన్ని కొనసాగించొచ్చని ఐఆర్జీసీలోని సీనియర్ అడ్వైజర్ ఒకరు వ్యాఖ్యలు చేశారు. ''యుద్ధాన్ని పొడిగించి ప్రత్యర్థిని బలహీనపర్చడం ఒక మార్గం. దీంతో ఇరాన్‌పై దాడి చేయాలనుకున్నవారు ఆలోచనలో పడతారు'' అని పేర్కొన్నారు.



## రూపాయికే ఉచిత సిమ్

(మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా లభిస్తుంది. 24 రోజుల పాటు అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్లు, రోజుకు 1 జీబీ డేటా లభిస్తుంది. ఈ ఆఫర్ సెప్టెంబర్ 12 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ వేదికగా పేర్కొంది.

గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ప్లాన్' పేరుతో రూ.1 ప్లాన్ను తొలుత తీసుకొచ్చింది. ఈ ప్లాన్ కింద 30 రోజుల వ్యాలిడిటీ ఇచ్చేది. రోజుకు 100 ఎస్సెమ్మెస్లు, 2జీబీ డేటా, అపరిమిత కాల్స్ అందించింది. ఫ్రీడమ్ 2.0 ప్లాన్లో భాగంగా తాజాగా ఈ ప్లాన్ వ్యాలిడిటీని 24 రోజులకు కుదించింది. రోజుకు 1జీబీ హైస్పీడ్ డేటాకే పరిమితం చేసింది. ఈ ప్లాన్ కొత్త వినియోగదారులకే... పాత బీఎస్ఎన్ఎల్ యూజర్లకు వర్తించదు.




# మానవ-వన్యప్రాణి సంఘర్షణ లేని జీవనం అత్యున్నతమైనది

**విశాఖపట్నం, ఆగస్టు 13(మనం న్యూస్):** మానవులు-వన్యప్రాణుల మధ్య సంఘర్షణ లేకుండా సహజీవనం సాగించే పరిస్థితులే నిజమైన అభివృద్ధికి సూచిక అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, కుంకీ ఏనుగుల వినియోగంతో రాష్ట్రంలో మానవ-ఏనుగుల ఘర్షణలను గణనీయంగా తగ్గించగలిగామని తెలిపారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్తో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు చేపట్టిన అనంతరం మానవ-ఏనుగు సంఘర్షణలను తగ్గించడం పట్ల ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మదపుటేనుగుల సమస్యను అధిగమించేందుకు కర్ణాటక రాష్ట్ర సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. వాటి సహకారంతో ఏజెన్సీ ప్రాంతాల్లో మంచి ఫలితాలు లభిస్తున్నాయని, ఇప్పటివరకు 15 కీలక కార్యకలాపాల్లో కుంకీ ఏనుగులు సహకరించాయని వెల్లడించారు. దీనివల్ల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70 శాతం వరకు తగ్గాయని, పంటనష్టం కూడా గణనీయంగా తగ్గిందన్నారు. దేశంలో ఏనుగుల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, 2014 నుంచి ఏనుగుల సంరక్షణ కేంద్రాల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందన్నారు. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్', కారిడార్ల రక్షణ, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు ఏనుగుల పరిరక్షణకు దోహదపడుతున్నాయని



తెలిపారు. దేశవ్యాప్తంగా 150 ఏనుగు కారిడార్లను గుర్తించడం ద్వారా వాటి సహజ ఆవాసాల పరిరక్షణకు బలం చేకూరిందన్నారు.కుంకీ ఏనుగుల ఏర్పాటులో సహకరించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అప్పటి అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య సహకారానికి నిదర్శనమే కాకుండా, ప్రజలు, ప్రకృతి-వన్యప్రాణుల పరిరక్షణకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఇప్పటికే శిక్షణ పొందిన 'జయంత్' అనే కుంకీ ఏనుగు పార్వతీపురం మన్యం జిల్లాలో సేవలందిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**హనుమాన్ ప్రాజెక్టుతో విశేష ఫలితాలు**

మానవ-వన్యప్రాణుల సంఘర్షణలను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2026 మార్చిలో 'హనుమాన్' ప్రాజెక్టును ప్రారంభించిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. వేగవంతమైన స్పందన, సాంకేతిక పరిజ్ఞానం, నష్టం నివారణ చర్యల సమన్వయంతో ఈ ప్రాజెక్టు అమలవుతోందన్నారు. ప్రాజెక్టు కింద 93 స్పందన వాహనాలు, 7 వన్యప్రాణి అంబులెన్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కు పైగా జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. వన్యప్రాణుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, సమాజం కూడా భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో రైతులు భయంలేకుండా వ్యవసాయం చేసుకునే పరిస్థితులు కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రజలు, వన్యప్రాణులు సురక్షితంగా సహజీవనం చేసే భవిష్యత్తు నిర్మాణమే అసలైన విజయమని అన్నారు.

**ప్రాజెక్ట్ ఎలిఫెంట్ - 30 జెయింట్ స్టెప్స్ పుస్తకావిష్కరణ**

అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ రూపొందించిన ప్రాజెక్ట్ ఎలిఫెంట్ - 30 జెయింట్ స్టెప్స్ పుస్తకాన్ని కేంద్ర సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్తో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక, వన్యప్రాణి శాస్త్రానికి సంబంధించిన పలు గ్రంథాలను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఏనుగుల సంరక్షణలో ప్రాణత్యాగం చేసిన ఒడిశాకు చెందిన అటవీ శాఖ అధికారి జుగల్ నాయక్కు గజ గౌరవ్ అవార్డును ప్రదానం చేశారు. అలాగే ఏనుగుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలు, రక్షణ చర్యల్లో విశేష సేవలందించిన సిబ్బందిని ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు.కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి సుశీల్ కుమార్ అవస్థి, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, కేంద్ర-రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలతో భద్రతా ప్రమాణాలపై జిల్లా ఎస్పీ సమీక్ష

**తిరుపతి ఆగష్టు 13 మనం న్యూస్:** తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ప్రతినిధులతో విద్యార్థుల భద్రత, భద్రతా ప్రమాణాలు మరియు నేరాల నివారణ చర్యలపై తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు గురువారం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, నేటి సమాజంలో ఎదురవుతున్న నూతన తరహా నేరాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ భద్రత తదితర అంశాలపై పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థుల భద్రత అనేది ఒక్క పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, పోలీసులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే మన పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించగలం అని అన్నారు.నేటి విద్యార్థులను కేవలం మంచి మార్కులు సాధించేలా తయారు చేయడం మాత్రమే విద్యాసంస్థల లక్ష్యం కాకూడదు. మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, మానవతా దృక్పథం, సమాజం పట్ల బాధ్యత కలిగిన ఉత్తమ పౌరులుగా వారిని తీర్చిదిద్దడమే అసలైన విద్య యొక్క లక్ష్యం అని ఎస్పీ పేర్కొన్నారు.సోషల్ మీడియా వినియోగంపై



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి,

ప్రస్తుతం సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, ఇతర సోషల్ మీడియా ప్లాట్ఫార్మ్లు విద్యార్థుల జీవితాల్లో భాగమవుతున్నాయని, సాంకేతికత అభివృద్ధి కోసం ఉపయోగపడాల్సిన సాధనాలు దుర్వినియోగం అయితే పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులు తమ బిజీ జీవితాల్లో పిల్లలకు తగినంత సమయం కేటాయించలేకపోతున్న పరిస్థితుల్లో, పిల్లలు సోషల్ మీడియాలో చూసే కంటెంట్పై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిఘా ఉంచాలని సూచించారు. పిల్లలకు సాంకేతికతను దూరం చేయడం పరిష్కారం కాదు.. దాన్ని బాధ్యతగా, సురక్షితంగా ఎలా ఉపయోగించాలో నేర్పించడమే అసలైన పరిష్కారం అని ఎస్పీ స్పష్టం చేశారు.సైబర్ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా వేధింపులు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఐడెంటిటీ థెఫ్ట్ తదితర సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, తెలియని వ్యక్తులతో ఆన్లైన్ పరిచయాలు, వ్యక్తిగత ఫోటోలు, వివరాలను సోషల్ మీడియాలో పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలను చిన్న వయసు నుంచే పిల్లలకు వివరించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ లు, శ్రీనివాసులు, (అడ్మినిస్ట్రేషన్), రవి మనోహరాచారి,(శాంతిభద్రతలు) మహిళా పోలీస్ విభాగం అధికారులు, సైబర్ క్రైమ్ పోలీస్ సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్-2026 ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

- నోటీసుల జారీ, పంపిణీ, విచారణలు, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి
- ఈసిఐ కార్యదర్శి శ్రీ సంతోష్ కుమార్ దుబే




**తిరుపతి, ఆగష్టు 13 మనం న్యూస్ :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026 (ఎస్ఐఆర్-2026) ప్రక్రియకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి (డీఈవో), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఒలు)తో భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) కార్యదర్శి శ్రీ సంతోష్ కుమార్ దుబే సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసారు.గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్. వెంకటేశ్వర్ సమావేశంలో పాల్గొని జిల్లాలో ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో జరుగుతున్న పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ఈసిఐ కార్యదర్శి శ్రీ సంతోష్ కుమార్ దుబే మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరుకు అవకాశం కల్పించే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

నోటీసుల జారీ, వాటి పంపిణీ, ఓటర్ల నుంచి అందే అభ్యంతరాలు, దరఖాస్తులు, విచారణలు తదితర అంశాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈఆర్ఒలు, ఏఈఆర్ఒలు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వారీగా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.బిఎల్ఒలు క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారికి సంబంధించిన దరఖాస్తులు, పత్రాలు, అభ్యంతరాలను సక్రమంగా స్వీకరించి, సంబంధిత వ్యవస్థలో అప్లోడ్ చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు.బిఎల్ఒ ల పనితీరును సూపర్వైజర్లు,ఈఆర్ఒ లు నిరంతరం సమీక్షించాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించే విచారణలను కూడా సకాలంలో పూర్తి చేయాలని, ఒకే ప్రాంతంలో అధిక సంఖ్యలో విచారణలు పెండింగ్లో లేకుండా ముందస్తు ప్రణాళికతో షెడ్యూల్ రూపొందించుకోవాలని సూచించారు. విచారణలకు హాజరయ్యే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

# ఎల్నినోతో 70శాతం వర్షాభావం



- పంటలు ఎండిపోతున్నాయని ఉపకులపతి ఆవేదన
- పంటల బీమా చేయించండి
- రైతులకు ఉపకులపతి డా. పి.వి. సత్య నారాయణ కీలక సూచనలు

**కలికిరి ఆగష్టు 13 మనం న్యూస్:** ఎల్-నినో ప్రభావంతో అన్నమయ్య జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, కలికిరి కేవీకే శాస్త్రవేత్తల బృందం తో కలిసి కురబలకోట, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు మండలాల్లో దెబ్బతిన్న వేరుశనగ, పశుగ్రాస, టమాటా పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పీలేరు వేపులబయలు గ్రామంలో రైతులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పరిశోధనా సంచాలకులు డా. వి. సుమతి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. పంట విస్తీర్ణం కేవలం 10% మాత్రమే ఉంది. బోర్లలో నీరు తగ్గిపోయి పంటలు వాడి ఎండిపోతున్నాయని వివరించారు.

పశుగ్రాస హెచ్చరిక

రాబోయే రోజుల్లో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడనుందని ముందస్తు జాగ్రత్త లు తీసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం పెల్లటైజేషన్ ప్రక్రియతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు వేపించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు.

డా. సత్యనారాయణ మాట్లాడుతూజిల్లాలో 70% వర్షాలు లేక పంటలు తినడం ఆవేదన కు గురిచేస్తోందని అన్నారు. ఈ పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు . విపరీత వాతావరణానికి తట్టుకునే కొత్త వంగడాల అభివృద్ధికి ప్రయత్నాలు మొదలుపెడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్ఎఎస్ఆర్ అసోసియేట్ డైరెక్టర్ డా. బి. చంద్రిక, పెరమాళ్ళపల్లి హెడ్ డా. రెడ్డి కుమార్, కేవీకే కలికిరి హెడ్ డా. కె. మంజుల, జిల్లా వ్యవసాయాధికారి శ్రీమతి హరిప్రియ, శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాంకర్ల సమన్వయంతో.. లక్ష్యాల సాధన!

- రుణ ప్రణాళిక లక్ష్యాలు వంద శాతం సాధించాలి
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.. ఎన్ పి ఏ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- సకాలంలో రుణాలు.. వేగంగా డిపాజిట్ల సమీకరణ..రూ.22,658 కోట్ల రుణాలు.. రూ.12,193 కోట్ల డిపాజిట్లు



**పుట్టపర్తి, ఆగష్టు 13 మనం న్యూస్:** బ్యాంకర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి త్రైమాసిక డిసిసి, బిడి ఎల్ ఆర్ సి సమావేశంలో జిల్లాలో బ్యాంకింగ్ ప్రగతి, ప్రభుత్వ సంక్షేమ-అభివృద్ధి పథకాల అమలుపై సమీక్షించారు.

తొలి త్రైమాసికంలో జిల్లాలో రూ.12,193.67 కోట్ల డిపాజిట్లు, రూ.22,658.34 కోట్ల రుణాలు ఉన్నట్లు ఎల్డిఎం ఫణీంద్ర కుమార్ వెల్లడించారు. క్రాప్ ఇన్సూరెన్స్, వ్యవసాయ రుణాల మంజూరులో పురోగతి సాధించినట్లు తెలిపారు.

పీఎం సూర్యఘర్, పి ఎం ఎఫ్ ఎం ఈ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకుల్లో ఎన్పీఏ శాతాన్ని తగ్గించేందుకు డి ఆర్ డి ఏ ఎం ఈ పి ఎం ఏ , వ్యవసాయ శాఖలు బ్యాంకర్లకు సహకరించాలని ఆదేశించారు. ఎస్ హెచ్ జి ల రుణాల్లో ఎన్ పి ఏ తగ్గించేందుకు గ్రూప్ లీడర్లు, యూనియన్లు, సీసీ లు సహకరించాలన్నారు.రుణాల మంజూరులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు బ్యాంకింగ్ డిపాజిట్లను వేగంగా సమీకరించాలని కలెక్టర్ సూచించారు

# దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం - గ్రూప్ 1

- పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి రాజీనామా చేయాలి
- శాప్ చైర్మన్ రవి నాయుడు డిమాండ్



**తిరుపతి ప్రెస్ క్లబ్ ఆగష్టు 14 మనంన్యూస్ :** గత వైఎస్ఆర్సిపి పాలనలో దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా గ్రూప్-1 పరీక్షలను నిర్వహించిన గత ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి, గ్రూప్ వన్ నియామకాల లో జరిగిన అతి పెద్ద కుంభకోణం అని,సిట్ నివేదికలో అధికారుల అక్రమ నియామకం బయట పడుతుందని డీఎస్సీ పై ఆరోపణలు చేస్తున్నారని శాప్ చైర్మన్ రవి నాయుడు ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.రవి నాయుడు మాట్లాడుతూ ఏపీపీఎస్సీని జగన్ జేబు సంస్థగా మార్చుకున్నాడని, ప్రశ్న పత్రాల మ్యాన్యువల్స్ పక్కనపెట్టి డిజిటల్ వాల్యుయేషన్ కు వెళ్లారని అన్నారు.గ్రూప్ వన్ అభ్యర్థులు కోర్టుకు వెళితే వాళ్లకు కావలసిన వ్యక్తులకు ఎక్కువ మార్కులు వేసుకొని, మెరిట్ ఉన్న అభ్యర్థులకు తక్కువ మార్కులు వేశారని,ఉదయ భాస్కర్ లాంటి అధికారులను పక్కనపెట్టి తాడేపల్లి నుంచి వచ్చిన సూచనలతోనే అవినీతి జరిగిందని ఆరోపించారు.ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలు తొలగించారని, ప్రైవేటు వ్యక్తులు పదుల సంఖ్యలో అక్కడికి వచ్చారని పేర్కొన్నారు. జుడిసీఎల్ అండర్ లో జరిగిన సిట్ వేదికలో పొందుపరిచారన్నారు.ఒక ఆర్డిఓ,ఎంఆర్ఓ క్యాడర్ వ్యక్తుల ను నిర్ణయించేది పేపర్స్ ను కరెక్షన్ చేసిన ఆటో డ్రైవర్,సెక్యూరిటీ గార్డులు,ఎలక్ట్రిషన్, మేస్త్రీలు,నియామక పత్రాలను మూల్యాంకరణం చేశారని,ఆర్డీవో,ఎమ్మార్వో గెజిటెడ్ ఆఫీసర్స్ ను నిర్ణయించేది వీళ్లేనా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు,మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్వీఎం శ్రీధర్,కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హేమంత్ రాయల్,తెలుగు యువత నాయకులు రంజిత్,టిడిపి తిరుపతి ఉపాధ్యక్షులు లోకేష్ రాయల్,కొత్త వీధి వెంకటేశ్వర స్వామి టెంపుల్ డైరెక్టర్ ప్రకాష్,ఆర్ కే తదితరులు పాల్గొన్నారు.





# జిల్లాలో పెన్షన్స్ పంపిణీ మరింత మెరుగ్గా చేపట్టాలని ఆదేశాలు

- ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్ లో పనితీరుపై సమీక్ష
- సమీక్షకు హాజరైన డిఆర్డీఏ పిడి శైలజ, సెర్ప్ స్టేట్ ఆఫీసు పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ హనుమ నాయక్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, తదితరులు

**అనంతపురం, కలెక్టరేట్ ఆగష్టు 13 : మనం న్యూస్ :** అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో గురువారం జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్ కు సంబంధించి క్షేత్రస్థాయి పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి డిఆర్డీఏ పిడి శైలజ, సెర్ప్ స్టేట్ ఆఫీసు నుంచి పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ హనుమ నాయక్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, తదితరులు హాజరయ్యారు. పెన్షన్ పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్బ్యాక్ కు సంబంధించి విశ్లేషణ మరియు ప్రగతి మెరుగుపరచడం మరియు పనితీరుపై సమీక్ష నిర్వహించి, సంబంధిత అంశాలపై అవసరమైన సూచనలు మరియు ఆదేశాలను డిఆర్డీఏ పిడి, సెర్ప్ స్టేట్ ఆఫీసు పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ ఇవ్వడం జరిగింది. జిల్లాలో పెన్షన్స్ పంపిణీ మరింత మెరుగ్గా చేపట్టాలని వారు ఆదేశించారు. ఈ సమావేశంలో పెన్షన్స్ హెచ్.డి డిపిఎం ఎన్.రవీంద్ర బాబు, పెన్షన్స్ ఏపీవో అజంతుల్లా, డిప్యూటీ ఎంపీడీవోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పెన్షన్ పంపిణీ అధికారులు, డిఆర్డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 31 లోగా ఎస్ఐఆర్ నోటీసుల డెలివరీ పూర్తి కావాలి



- రోజు వారీ లక్ష్యాలతో ఫార్మ్ -6, 8 ల పరిష్కారం చేయాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, ఆగష్టు 13మనం న్యూస్:** ఎస్.ఐ.ఆర్ లో భాగంగాఈ నెల 31 లోగా నోటీసుల డెలివరీ పూర్తి కావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయంకాన్ఫరెన్స్ హల్ 5 వ బ్లాక్, అమరావతి నుండి అన్ని జిల్లా కలెక్టర్లు తో ఎలక్షన్స్ (పోలింగ్ కేంద్రాలు, సర్, ఫారం 6,7, 8) కు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నేను వివేక్ యాదవ్, స్థానిక కలెక్టరేట్లోని నాగార్జున ఐఏఎస్ . వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ కె. మోహన్ కుమార్ ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్, మాట్లాడుతూమ్యాపింగ్ కాని ఓటర్లకు, మ్యాపింగ్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ చేయాలి,జారీ చేసిన నోటీసులను ఓటర్లకు అందజేయాలని తెలిపారు.

# రీసర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

**కళ్యాణదుర్గం , ఆగష్టు 13 మనం న్యూస్:** రీ-సర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో 6వ దశ కింద చేపట్టిన రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా రీ-సర్వేకు సంబంధించి రైతులకు ముందుగా నోటీసులు అందాయా లేదా అని రైతులను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సర్వే ఎంతవరకు జరుగుతుందనే వివరాలను ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ (గ్రౌండ్ ట్రూథింగ్ ) ప్రక్రియ జరుగుతోండగా, మొత్తం 10,000 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2,700 ఎకరాలలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయింది.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీ లక్ష్యాలను మించి పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనకప్రసాద్, డెప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల తహసిల్దార్ ఆంజనేయ ప్రసాద్, ఆర్ఎస్డిటి, మండల సర్వేయర్, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



# అన్ని దానాల కన్నా అవయవ దానం మిన్న

## స్విమ్స్ ఉపకులపతి డ్యా ఆర్.వి.కుమార్

**తిరుపతి ఆగష్టు 13 మనం న్యూస్:** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లోని గురువారం స్విమ్స్ యన్.టి.ఆర్ సర్కిల్ నుండి వాల్మికి సర్కిల్ వరకు జాతీయ అవయవదాన దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డ్యా రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు,ఉపకులపతి డ్యా ఆర్.వి. కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డ్యా




ఆర్.వి.కుమార్ ప్రసంగిస్తూ మనిషి మరణించిన కూడా వారి అవయవాల ద్వారా జీవించే భాగ్యం అవయవ దానం ద్వారా మాత్రమే సాధ్యమైతుందని పేర్కొన్నారు. మనిషి జీవించి వున్నప్పుడు కిడ్నీ, లివర్ పనిచేయకపోయి మరి ఏ చికిత్సకు పనిచేయని సందర్భంలో ఈ అవయవ మార్పిడి అవసరం అవుతుందని, వీటికి వేరే మనిషి అవయవాలను దానం చేయడం తప్ప వేరే మార్గంలేదని, అందువల్ల ఎవరైన బ్రెయిన్ డెడ్ అయిన మనిషి అవయవాలను దానం చేయవలసిందిగా ప్రోత్సహించాలని కోరారు. స్వచ్ఛందంగా అవయవ దానం నమోదు చేసుకోదలచిన వారు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోగలరు. అవయవదానంపై ఉన్న అపోహలు తొలిగించేందుకు విద్యార్థిని, విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## నేను నేనుగా ఎప్పుడు బతికాను

నా బంధనాలు తెంపుకొని
బహిరంగ ప్రదేశాల్లో స్వేచ్ఛగా
తిరగాలనుకున్నప్పుడు
నన్ను బందెల దొడ్డిలో బంధించి
పారిపోకుండా ఉండడానికి
పనగడ అడ్డంపెట్టింది మీరు

నేను చెంగుచెంగు మంటూ
లేగ దూడలా గంతేయాలని
పచ్చిక బయల్లల్లో పరుగు
తీయాలని మనసు పడ్డప్పుడు
నా కాళ్ళలో లెంకపీట కట్టి
నా నడకకు అడ్డం తగిలింది మీరు

నా హక్కులను రక్షించమంటూ
వేడుకున్నప్పుడల్లా నన్ను
సాంప్రదాయపు చెరసాలలో బంధించి
కర్మ సిద్ధాంతం గోడల్లో కట్టిపడేసి
సనాతన ధర్మపు సమాధుల మధ్య
ప్రాణంతో పాతర వేసింది మీరు.

నా అడుగు అడుగుకు హద్దులు గీసి
నా జీవితాన్ని ఒక చట్రంలో బంధించి
నా ప్రతి కదలికకు రూపకల్పన చేసి

అదే జీవితమని నన్ను నమ్మించి
నన్ను నన్నుగా జీవించకుండా చేసింది మీరు

ఎంతకాలం నా ఓపికను కట్టేయగలరు
ఎప్పుడో ఒక రోజు చెరువు కట్ట తెగినట్టుగా
లావాల పొంగి పారినట్టుగా పారుతూ
నిన్ను నిండా ముంచే ఒక రోజు వస్తుంది
అంత వరకే మీ ఆగడాలు.

**- నెరువట్ల చైతన్య**
9491470746

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# భారత విభజన పూర్వాపరాలు.. విశ్లేషణ



భారతదేశ చరిత్రలో 1947 ఆగస్టు 15వ తేదీ ఒకవైపు శతాబ్దాల పారతంత్ర పరిమోచనకు, స్వరాజ్య ఆవిర్భావానికి ప్రాతిపదికగా నిలిస్తే, మరొకవైపు కోట్లాది మంది గుండెల్లో శాశ్వత గాయాన్ని మిగిల్చిన తీవ్ర విషాదానికి వేదికైంది. భిన్న మతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు శతాబ్దాలుగా సహజీవనం చేసిన ప్రాచీన భరతఖండం, రాజకీయ నిర్ణయాలు మరియు మత రాజకీయాల ఫలితంగా భారత్, పాకిస్థాన్ అనే రెండు వేర్వేరు సార్వభౌమ రాజ్యాలుగా చీలిపోయింది. స్వాతంత్ర్యోదయం సంబరాలను తెస్తే, విభజన ప్రక్రియ లక్షలాది కుటుంబాల జీవితాలను ధ్వంసం చేసింది. అందుకే భారత విభజనను కేవలం రెండు సరిహద్దుల రేఖల మార్పుగా కాకుండా వలస పాలనలోని వ్యూహాలు, నాయకత్వ వైఫల్యాలు, అధికార పోరాటాలు, తీవ్ర సామాజిక భయాలు కలగలిసి రూపుదిద్దుకున్న సంక్లిష్ట మానవ విపత్తుగా విశ్లేషించాల్సి ఉంటుంది.

ఈ విభజన బీజాలు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో, తదనంతరం 1858లో బ్రిటిష్ కిరీట పాలన ప్రత్యక్షంగా ప్రారంభమైన తరుణంలోనే పడ్డాయి. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హిందూ-ముస్లింలు కలసి కట్టుగా పోరాడటాన్ని చూసి భయపడిన ఆంగ్లేయ పాలకులు, తమ సామ్రాజ్య పునాదులను పటిష్టం చేసుకోవడానికి 'విభజించి పాలించు' (Divide and Rule) విధానాన్ని ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారు. 1905 నాటి బెంగాల్ విభజన దీనికి తొలి ఉదాహరణ కాగా, 1906లో అఖిల భారత ముస్లిం లీగ్ ఆవిర్భావం ఈ పరిణామాలకు మరింత వేగాన్ని ఇచ్చింది. ఆపై 1909 నాటి మింటో-మార్లీ సంస్కరణలు ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను (Separate Electorates) కేటాయించడం ద్వారా మత ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యాన్ని అధికారికంగా సంస్థాగతీకరించాయి. ఇది భారతీయ సమాజంలో మతపరమైన వేర్పాటువాద ఆలోచనలకు బీజం వేసింది.

కాలక్రమేణా ముస్లిం లీగ్ ప్రత్యేక మత రాజకీయ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. 1930లో అలహాబాద్‌లో జరిగిన ముస్లిం లీగ్ సమావేశంలో ప్రముఖ కవి, తత్త్వవేత్త అల్లామా మహమ్మద్ ఇక్బాల్ వాయువ్య ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు ప్రత్యేక రాజకీయ వ్యవస్థ ఉండాలనే ఆలోచనను తొలిసారిగా ప్రతిపాదించారు. 1933లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యార్థి చౌధరి రహ్మత్ అలీ 'పాకిస్థాన్' (పంజాబ్, ఆఫ్ఘనిస్థాన్, కాశ్మీర్, సింధ్, బలూచిస్థాన్‌ల సంక్షిప్త రూపం) అనే నామకరణాన్ని ప్రచారంలోకి తెచ్చారు. మహమ్మద్ అలీ జిన్నా నాయకత్వంలో ముస్లింలీగ్ 'ద్విజాతి సిద్ధాంతాన్ని' (Two& Nation Theory) తీవ్రంగా ప్రచారం చేసింది. హిందువులు, ముస్లింలు కేవలం వేర్వేరు మతాలకు చెందినవారు మాత్రమే కాకుండా, వారి సంస్కృతి, సామాజిక విలువలు, జీవన విధానాలు పూర్తిగా భిన్నమైనవని, కాబట్టి వారు ఒకే దేశంగా మనుగడ సాగించలేరని జిన్నా వాదించారు. 1940 మార్చి 23న లాహోర్ సమావేశంలో ముస్లిం లీగ్ చేసిన 'లాహోర్ తీర్మానం' ప్రత్యేక పాకిస్థాన్ డిమాండ్‌కు అధికారిక పునాదిగా మారింది.

రెండవ ప్రపంచ యుద్ధం తదనంతర పరిణామాలు అధికార మార్పిడిని అనివార్యం చేశాయి. 1942 నాటి క్రిప్స్ రాయబారం, 1945 నాటి సిమ్లా సదస్సు, 1946 నాటి క్యాబినెట్ మిషన్ వంటివి భారత ఐక్యతను కాపాడుతూ అధికార బదిలీకి మార్గాలు అన్వేషించాయి. క్యాబినెట్ మిషన్ కేంద్రానికి పరిమిత అధికారాలు ఇస్తూ, రాష్ట్రాలను మూడు గ్రూపులుగా విభజించే సమాఖ్య నమూనాను ప్రతిపాదించింది. ప్రారంభంలో కాంగ్రెస్, ముస్లిం లీగ్ దీనికి సూత్రప్రాయంగా అంగీకరించినా, కేంద్ర ప్రభుత్వం యొక్క అధికార పరిధి మరియు రాష్ట్రాల ప్రాధాన్యతలపై జవహర్లాల్ నెహ్రూ, జిన్నాల మధ్య కుదరని ఏకాభిప్రాయం వల్ల ఈ ప్రణాళిక విఫలమైంది.

క్యాబినెట్ మిషన్ వైఫల్యంతో తీవ్ర నిరాశకు గురైన జిన్నా, 1946 ఆగస్టు 16ను 'ప్రత్యక్ష కార్యాచరణ దినం'గా (Direct Actionday) ప్రకటించారు. ఇది కలకత్తాలో భయానక మతకల్లోలాలకు దారితీసింది. 'గ్రేట్ కలకత్తా కిల్లింగ్స్'గా చరిత్రలో నిలిచిన ఈ హింసలో కొద్ది రోజుల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మతచిచ్చు త్వరలోనే తూర్పు బెంగాల్‌లోని నోయాఖలి, బిహార్, పంజాబ్, రేవల్పిండి ప్రాంతాలకు దావానలంలా వ్యాపించింది. గ్రామాలకు గ్రామాలు తగలబడిపోయాయి. ఈ రక్తపాతం సమాజంలో పరస్పర విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీసింది, విభజన తప్ప వేరే మార్గం లేదనే వాతావరణాన్ని సృష్టించింది.

పరిస్థితి చేయిదాటిపోతుండటంతో బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ 1947 ఫిబ్రవరి 20న పార్లమెంట్‌లో మాట్లాడుతూ, 1948 జూన్ లోపు ఆంగ్లేయులు భారతదేశాన్ని వదిలివెళ్తారని, అధికార బదిలీ పూర్తి చేస్తారని ప్రకటించారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చివరి వైస్రాయ్‌గా వచ్చిన లార్డ్ మౌంట్‌బాటన్ ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. 1947 జూన్ 3న 'మౌంట్‌బాటన్ ప్రణాళిక' విడుదల కాగా, బ్రిటిష్ పార్లమెంట్ 'భారత స్వాతంత్ర్య చట్టం 1947'ను ఆమోదించింది. దీంతో భారత్, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన దేశాల ఆవిర్భావానికి చట్టబద్ధత లభించింది.

అయితే సరిహద్దుల నిర్దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన చారిత్రక పొరపాటు మానవాళికి తీరని శోకాన్ని మిగిల్చింది. బ్రిటిష్ న్యాయవాది సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌కు పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల విభజన బాధ్యతను అప్పగించారు. భారతదేశ భౌగోళిక, సాంస్కృతిక, జనాభా సంక్లిష్టతలపై ఎటువంటి ప్రాథమిక అవగాహన లేని రాడ్‌క్లిఫ్, కేవలం పాత జనాభా లెక్కల ఆధారంగా నదులు, కాలువలు, గ్రామాలు, చివరకు ఇళ్లను కూడా రెండుగా విభజిస్తూ సరిహద్దు రేఖను గీశారు. అత్యంత దారుణమైన విషయమేమిటంటే, ఈ సరిహద్దు వివరాలను ఆగస్టు 15న కాకుండా, స్వాతంత్ర్యం వచ్చిన రెండు రోజుల తర్వాత, అంటే 1947 ఆగస్టు 17న ప్రకటించారు. తాము ఏ దేశంలో ఉన్నామో తెలియక లక్షలాది మంది ప్రజలు తీవ్రమైన అనిశ్చితికి, భయాందోళనలకు గురయ్యారు.

1947 ఆగస్టు 14న పాకిస్థాన్, ఆగస్టు 15న భారతదేశం అవతరించాయి. కానీ సరిహద్దుల ప్రకటన వెలువడగానే ప్రపంచ మానవ చరిత్రలోనే అతిపెద్ద బలవంతపు జనాభా మార్పిడి (Mass Migration) సంభవించింది. తమ శతాబ్దాల నాటి ఆస్తులను, ఇళ్లను, పూర్వీకుల జ్ఞాపకాలను వదిలేసి హిందువులు, సిక్కులు భారత్‌కు, ముస్లింలు పాకిస్థాన్‌కు కాలినడకన, ఎడ్ల బండ్లపై, కిక్కిరిసిన రైళ్లలో ప్రయాణించారు. దాదాపు 1.4 కోట్ల నుంచి 1.6 కోట్ల మంది ప్రజలు తమ పురిటిగడ్డను వదిలి అభయారణ్యం కోసం సరిహద్దులు దాటారు. ఈ వలసల బాటలో చెలరేగిన మత హింసలో 5 లక్షల నుంచి 10 లక్షల మంది దారుణంగా హత్యకు గురయ్యారు. వేలాది మంది మహిళలపై లైంగిక దాడులు, అపహరణలు జరిగాయి. పంజాబ్, బెంగాల్లలో ప్రవహించిన నదులు, ప్రయాణించిన రైళ్లు శవాల దిబ్బలుగా మారాయి.

విభజన అనంతర పరిణామాలు నవభారతానికి, నూతన పాకిస్థాన్‌కు తీవ్ర సవాళ్లను విసిరాయి. ఢిల్లీ, అమృత్సర్, లాహోర్, కలకత్తా, కరాచీ వంటి నగరాలు లక్షలాది మంది శరణార్థులతో నిండిపోయాయి. పునరావాసం కల్పించడం స్వతంత్ర భారత ప్రభుత్వానికి తొలి ప్రధాన పరీక్షగా మారింది. ఆస్తుల పంపిణీ, సైనిక బలగాల విభజన, నదీ జలాల పంపిణీ వంటి ఆర్థిక పరిపరిణామాలతో పాటు, ప్రిన్స్‌లీ స్టేట్స్ (సంస్థానాలు) విలీనం సరికొత్త వివాదాలకు దారితీసింది. ముఖ్యంగా జమ్మూ-కాశ్మీర్ సంస్థానం భారత్‌లో విలీనమైన క్రమంలో 1947లో సంభవించిన మొదటి ఇండో-పాక్ యుద్ధం ఇరు దేశాల మధ్య శాశ్వత శత్రుత్వానికి పునాది వేసింది.

ఈ విశ్లేషణ ద్వారా తేలేదేమిటంటే, భారత విభజన అనేది కేవలం ఒక వ్యక్తి లేదా ఒక రాజకీయ పార్టీ నిర్ణయం కాదు. బ్రిటిష్ వలస పాలనా వ్యూహాలు, శతాబ్దాల సహజీవనంలో చోటుచేసుకున్న మత రాజకీయాల విద్వేషాలు, కాంగ్రెస్-ముస్లిం లీగ్‌ల మధ్య పవర్ షేరింగ్ వైఫల్యాలు, అధికారాన్ని త్వరగా బదిలీ చేయాలనే బ్రిటిష్ తొందరపాటుల సమ్మేళనం. మహాత్మా గాంధీ అంతిమ ఘడియ వరకు దేశ ఐక్యత కోసం, మత సామరస్యం కోసం శ్రమించినప్పటికీ, రగులుతున్న హింసాజ్వాలల ముందు ఆ ప్రయత్నాలు నెరవేరలేకపోయాయి. నెహ్రూ, పటేల్, జిన్నా వంటి నేతలు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తీవ్రమైన రాజీ మార్గాలను ఎంచుకోవాల్సి వచ్చింది.

'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్'అన్న గురజాడ అప్పారావు వాక్కులు విభజన విషాదాన్ని అర్థం చేసుకోవడానికి నేటికీ దిక్సూచిగా నిలుస్తాయి. గతాన్ని నిందించడం కాకుండా, చరిత్రలోని లోటుపాట్లను అర్థం చేసుకుంటూ, జాతి రక్షణకు, సామాజిక ఐక్యతకు, లౌకిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉండటమే ఆ విభజన బాధితులకు మనం ఇచ్చే నిజమైన నివాళి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# అణు ఒప్పందం.. కొత్త 'సమీకరణాలకు'నాంది



అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు; శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. అమెరికా-సౌదీ అరేబియా మధ్య కుదిరిన పౌర అణుశక్తి సహకార ఒప్పందం ఈ వాస్తవాన్ని మరోసారి స్పష్టంగా చాటుతోంది. ఉపరితలంపై ఇది శాంతియుత అణుశక్తి వినియోగానికి సంబంధించిన ఒప్పందంలా కనిపించినా, దాని అంతరార్థం పశ్చిమాసియాలో శక్తి సమతుల్యతను అమెరికాకు అనుకూలంగా పునర్నిర్మించడం. ఇది కేవలం రియాద్‌కు అణు సాంకేతికత బదిలీ కాదు. ఇరాన్‌ను నియంత్రించడం, చైనా వ్యూహాత్మక చొరబాటును అడ్డుకోవడం, రష్యా ప్రభావాన్ని పరిమితం చేయడం, అమెరికా ఆధ్వర్యంలోని ప్రాంతీయ భద్రతా వ్యవస్థను పునరుద్ధరించడం వంటి బహుళ లక్ష్యాల సమ్మేళనం.

అంతర్జాతీయ సంబంధాల ప్రముఖ సిద్ధాంతకర్త హెన్రీ కిసింజర్ ప్రతిపాదించిన 'బ్యాలెన్స్ ఆఫ్ పవర్' భావన ప్రకారం, ఒక ప్రాంతంలో ఏ ఒక్క దేశం అత్యంత బలంగా మారకుండా ప్రత్యర్థి శక్తులను సమతుల్యం చేయడం ద్వారానే స్థిరత్వం సాధ్యమవుతుంది. ప్రస్తుతం అమెరికా అదే సిద్ధాంతాన్ని పశ్చిమాసియాలో అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమం, దాని క్షిపణి సామర్థ్యం, హెజ్బొల్లా, హౌతీలు, హష్ద్ అల్-షాబీ వంటి మిత్ర బలగాల ద్వారా విస్తరిస్తున్న ప్రభావం నేపథ్యంలో సౌదీని వ్యూహాత్మక ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది.

ప్రపంచ ఆధిపత్యం కొనసాగాలంటే కీలక భౌగోళిక ప్రాంతాల్లో మిత్రదేశాలను బలోపేతం చేయాలనే సిద్ధాంతం ప్రకారం అమెరికా ఇప్పుడు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియాలను ఎలా బలోపేతం చేస్తోందో, పశ్చిమాసియాలో అదే పాత్రను సౌదీకి అప్పగించాలని చూస్తోంది. ఈ పరిణామంలో చైనా పాత్ర అత్యంత కీలకం. 2023లో బీజింగ్ మధ్యవర్తిత్వంతో సౌదీ-ఇరాన్ సంబంధాలు పునరుద్ధరించబడటం అమెరికాకు దౌత్యపరమైన ఎదురుదెబ్బ. బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం ద్వారా చైనా



గల్ఫ్ దేశాల్లో భారీ పెట్టుబడులు పెడుతోంది. సౌదీ కూడా చైనాతో ఇంధనం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించింది. ఈ పరిస్థితిలో అణు సహకారాన్ని అమెరికా ఒక వ్యూహాత్మక 'ఆంకర్'గా ఉపయోగిస్తోంది. అంటే, సౌదీ భద్రత అమెరికాతోనే ముడిపడి ఉండేలా చేయడమే లక్ష్యం.

రష్యా కోణం కూడా అంతే ప్రాధాన్యమైనది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా పశ్చిమ ఆంక్షలను ఎదుర్కొంటూ గల్ఫ్ దేశాలతో ఇంధన సహకారాన్ని బలోపేతం చేసింది. ఒపెక్(ఒపిఈసీ)+ వేదికపై సౌదీ-రష్యా సమన్వయం అమెరికాను అసౌకర్యానికి గురి చేసింది. అణు సహకారం ద్వారా ఆ వ్యూహాత్మక దూరాన్ని తగ్గించాలని వాషింగ్టన్ భావిస్తోంది.

ఇరాన్‌కు ఈ ఒప్పందం కేవలం దౌత్యపరమైన సవాలు కాదు. భద్రతాపరమైన హెచ్చరిక కూడా. సౌదీకి ప్రస్తుతం పౌర అణు సాంకేతికత లభించినా, భవిష్యత్తులో అది యురేనియం శుద్ధీకరణ సామర్థ్యాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తుందేమో అన్న అనుమానం టెహ్రాన్‌లో సహజంగానే ఉంటుంది. దానికి ప్రతిస్పందనగా ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసే అవకాశం ఉంది. దీంతో ప్రాంతీయ ఆయుధ పోటీ మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఇజ్రాయిల్ స్పందన ద్వంద్వ స్వభావంతో ఉంటుంది. ఇరాన్‌ను ఎదుర్కొనే విషయంలో బలమైన సౌదీ తనకు ఉపయోగపడుతుంది. కానీ అణు సాంకేతికత కలిగిన సౌదీ, దీర్ఘకాలంలో ప్రాంతీయ అణు సమీకరణాలను మార్చే అవకాశాన్ని కూడా ఇజ్రాయిల్ నిర్లక్ష్యం చేయదు. అందువల్ల అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పర్యవేక్షణ, కఠిన తనిఖీలు, యురేనియం శుద్ధీకరణపై పరిమితులు వంటి అంశాలపై అది పట్టుబట్టే అవకాశముంది. మిగతా అరబ్ ప్రపంచం కూడా ఈ పరిణామాన్ని అవకాశంగా చూస్తోంది. ఇప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పౌర అణు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సౌదీకి లభించే ప్రత్యేక హోదా తమకూ వర్తించాలని ఖతర్, కువైట్, బహ్రెయిన్ వంటి దేశాలు కోరే అవకాశం ఉంది. ఇది పశ్చిమాసియాలో పౌర అణుశక్తి విస్తరణకు దారితీస్తుంది. అయితే అదే సమయంలో అణు వ్యాప్తి నిరోధక వ్యవస్థపై కొత్త ప్రశ్నలను కూడా లేవనెత్తుతుంది.

భారత్‌కు ఈ పరిణామం ప్రత్యేక ప్రాధాన్యం కలిగినది. భారత ఇంధన దిగుమతుల్లో గల్ఫ్ దేశాల వాటా గణనీయమైనది. అంతేకాదు, అక్కడ పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత, భారత వాణిజ్య మార్గాలు, సముద్ర భద్రత-అన్నీ పశ్చిమాసియా స్థిరత్వంతో ముడిపడి ఉన్నాయి. కాబట్టి భారత్ అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే, సౌదీ, ఇరాన్, ఇజ్రాయిల్లతో మంచి సంబంధాలను కొనసాగించడం అత్యవసరం.

ఈ పరిణామం చివరకు ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెస్తోంది. అమెరికా రూపొందిస్తున్న ఈ కొత్త ప్రాంతీయ వ్యవస్థ నిజంగా శాంతి, స్థిరత్వాన్ని తీసుకువస్తుందా? లేక ప్రచ్ఛన్న యుద్ధ కాలంలా మరోసారి ప్రత్యర్థి కూటములు, ఆయుధ పోటీ, పరస్పర అనుమానాలకు దారి తీస్తుందా? చరిత్ర చెబుతున్న ఒక పాఠం ఏమిటంటే-శక్తి సమతుల్యత శాంతిని కాపాడగలదు. కానీ అదే సమతుల్యత ఆయుధ పోటీపై ఆధారపడితే, శాంతి ఎప్పుడైనా సంక్షోభంలో పడిపోవచ్చు. అందువల్ల అమెరికా-సౌదీ అణు ఒప్పందం ఇప్పుడు పశ్చిమాసియాను అలాంటి చారిత్రక కూడలిలో నిలబెట్టింది.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# ఆంధ్ర రైజింగ్ స్టార్ నారా లోకేష్



'ఫార్చ్యూన్ ఇండియా' అనే ఆంగ్ల పత్రిక ఇచ్చిన 'ఆంధ్ర రైజింగ్ స్టార్' గుర్తింపు యువనాయకుడు ఆంధ్ర ప్రజల ఆశా కిరణం విద్య శాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో ఫలితాలుగా మార్చడం, పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ పరిశ్రమలుగా మారి యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ, ముందుకు సాగుతున్న లోకేష్‌కు లభించిన ఓ గౌరవంగా భావించాలి. రాజకీయాల్లో వారసత్వం అనేది ఒక మెట్టు మాత్రమే. ఆ మెట్టుపై నిలబడి గమ్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన శ్రమ, పట్టుదల ఉంటేనే చరిత్ర గుర్తిస్తుంది. అనతి కాలంలోనే రాజకీయంగా తనకంటూ ఒక గుర్తింపు సాధించిన నాయకులు బహు అరుదుగా కనిపిస్తారు. అయితే రాష్ట్ర ఐటి, మానవ వనరుల శాఖ మంత్రి, తెలుగు దేశం పార్టీ కార్య నిర్వహక అధ్యక్షుడు నారా లోకేష్ ఆ కోవకే చెందుతారు. ఇదే విషయాన్ని 'ఫార్చ్యూన్ ఇండియా' తన ఆగస్టు సంచికలో స్పష్టంచేసింది.

'ఆంధ్రాస్ రైజింగ్ స్టార్ హా నారా లోకేష్' అంటూ మంత్రి ,యువనేత నారా లోకేష్‌ను ప్రశంసిస్తూ ప్రచురించిన కథనం తెలుగు ప్రజలకు దక్కిన గౌరవం. 40 అండర్ 40 విభాగంలో లోకేష్‌ను కీలకనాయకుడిగా పేర్కొనడాన్ని చూస్తే ఆయనను తెలుగు ప్రజల ఆశాకిరణంగా అభివర్ణించవచ్చు.

యువగళం నాయకుడిగానే కాకుండా మంత్రి పనితీరుతో ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడి ఇమేజ్‌కు లోకేష్ పరిమితం కాలేదు. రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త 'టెక్నో-పొలిటికల్' శకానికి ఆయన దారులు వేశారనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత లోకేష్ చేపడుతున్న విధి విధానాలు తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలో నూతన శకానికి నాంది పలుకుతున్నాయి. ఐటి, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలను



స్వీకరించిన క్షణం నుంచి నారా లోకేష్ రాష్ట్రాన్ని పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. గూగుల్ ప్రాజెక్టు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ , పునరుత్పాదక ఇంధనం, ఆటోమోటివ్ రంగాల్లో విదేశీ, స్వదేశీ దిగ్గజ సంస్థల నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రత్యేక వ్యూహాలను అమలు చేసున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 ఇండస్ట్రియల్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నారని ఫార్చ్యూన్ ఇండియా కథనం ప్రస్తుతించింది. యువగళం పాదయాత్ర ద్వారానే లోకేష్ ప్రజానాయకుడిగా ఎదిగి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. లోకేష్ నేటి 'జెన్-జీ' యువతతో మమేకమవుతున్నారు. వారసత్వం దాటి సొంత ముద్ర దిశగా అడుగులు వేస్తూ పరిణితి చెందిన నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆశిద్దాం.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖ మంత్రి,ఆంధ్రప్రదేశ్

# భారతీయ వీరనారి అహల్యాబాయి హోల్కర్



అహల్యాబాయి హోల్కర్ ప్రస్తుతం మహారాష్ట్రాలో ఉన్న అహల్యా నగర్ జిల్లాకు చెందిన చోండీ గ్రామంలో పాటిల్ లేదా చీఫ్ అయిన సుశీల - మంకోజి షిండే దంపతులకు 31 మే 1725న జన్మించింది. తల్లి తండ్రుల చొరవతో చదవడం, రాయడం నేర్చుకుంది. నిరాడంబర కుటుంబంలోంచి ఎదిగిన 8 ఏండ్ల అహల్యాబాయి ప్రవర్తనను గమనించిన మాల్వా ప్రాంత సైనిక కమాండర్ మల్హార్ రావు వెంటనే తన 10 ఏండ్ల కుమారుడు ఖండేరావుకు తగిన వధువుగా ఎంపిక చేసుకొని వివాహం జరిపించారు. 1745లో వారికి మలేరావు అనే కుమారుడు, 1748లో ముక్తాబాయి అనే కూతురు జన్మించారు.

1754లో కుంబేర్ ముట్టడి సమయంలో జరిగిన ఫిరంగుల కాల్పుల్లో ఖండేరావు మరణించగా నాటి ఆచారం ప్రకారం సతీసహగమనం చేయడానికి సిద్ధపడిన అహల్యాబాయిని మామ మల్హార్ రావు ఒప్పించి తన కోడలిని కాపాడారు. విధవరాలైన అహల్యాబాయికి రాజనీతి, రాజ్య పాలన, యుద్ధ నైపుణ్యాలు, ప్రజా సంక్షేమాల్లో శిక్షణ ఇవ్వడంతో ఆమె రాజ్య వ్యవహారాలను చక్కగా చూసుకోవడం జరిగింది. 1766లో మామ గారైన మల్హార్ రావు మరణించడంతో తన కుమారుడు మలేరావు రాజ్య బాధ్యతలను తీసుకోవడం, మానసిక అనారోగ్యంతో తన కుమారుడు మరణించడంతో దెబ్బ మీద దెబ్బ పడినట్లు అహల్యాబాయిని సమస్యలు వెంటాడాయి. నాడు స్త్రీలను రాజ్య పాలనకు అనర్హులుగా పరిగణించాడే వారు. కాని అహల్యాబాయి శక్తి, యుక్తి, పాలనా పటిమ లాంటి సామర్థ్యాన్ని గుర్తించిన నాటి మరాఠా ముఖ్యులు ఆమె సింహాసనం స్వీకరించడానికి అంగీకరించడం విశేషం.

అహల్యాబాయి మహారాణిగా పదవి చేపట్టిన తర్వాత తన సైన్యాన్ని ఆధునీకరిస్తూ బలోపేతం చేయడం, దౌత్య సంబంధాలను పటిష్ట పరచడం, పరిపాలనలో తనదైన ముద్రను చూపడంతో పాటు నిర్మాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేది. ఆమె సమర్థవంతమైన పాలనలో ప్రజలు శాంతి, స్థిరత్వం, పురోగతి, ఆధ్యాత్మిక వికాసం లాంటి అంశాలను రుచి చూడగలిగారు. ప్రజలతో మమేకం అవుతూ వారి యోగక్షేమాలు చూసుకుంటూ రామరాజ్య స్థాపన చేసిన అహల్యాబాయి ప్రజల ఆరాధ్య దైవంగా మారింది. నాడు మహిళలు పాటించే పర్దా లేదా స్త్రీల ఏకాంతవాసం ఆచారాన్ని పాటించకుండా ప్రజలతో నేరుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండేది. వివాదాల పరిష్కారం కోసం కోర్టులను కూడా స్థాపించడం అహల్యాబాయి మహారాణికి మాత్రమే ప్రత్యేకం. యుద్ధ భూమిలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక సామాన్య వ్యక్తికి తన కూతురును ఇచ్చి వివాహం జరిపించడం అహల్యాబాయి దార్శనికతకే నిదర్శనం.

మహారాణిగా అహల్యాబాయి అనేక కోటలు, రోడ్లు, బావులు, ధర్మశాలలు, హిందూ దేవాలయాలు, విశ్రాంతి గృహాలను నిర్మించడంతో పాటు నర్మదా నది ఒడ్డున తన రాజధానిగా మహేశ్వర్(శివుని నివాసం, నేటి మధ్యప్రదేశ్‌లో)ను నిర్ణయించింది. అనేక మంది కళాకారులు, శిల్పులకు ఉపాధి కల్పించడమే కాకుండా వారణాసి, ఘృష్ణేశ్వర్, త్రయంబక్, గయా, పుష్కర్, ద్వారక, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, మథుర, శ్రీశైలం, బృందావన్, నాథద్వారా, బధ్రీనాథ్, కేగార్నాథ్ లాంటి పలు ఆలయాలను పునర్నిర్మించడం జరిగింది.

శివుడికి నివాళిగా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాలను పునరుత్థానం చేసింది. 1780లో కాశీ ఆల యాన్ని పునర్నిర్మించింది. మహేశ్వర్‌లో వస్త్ర పరిశ్రమను సహితం స్థాపించడం జరిగింది. 13 ఆగష్టు 1795న అహల్యాబాయి హోల్కర్ మహారాణి మరణించడంతో మల్హార్ రావు దత్తపుత్రుడు తుకోజీ



రావు సింహాసనం అధిష్టించిన రెండు ఏండ్ల తర్వాత తన కుమారుడు జస్వంత్ రావుకు సింహా సనం వదులుకున్నారు. 1804లో బ్రిటీష్ వారితో యుద్ధంలో ఓడిపోయిన చివరి హోల్కర్ పాలకుడిగా మిగిలి పోయారు.

మహారాణి అహల్యాబాయి హోల్కర్ బహుముఖ ప్రజ్ఞకు గుర్తుగా ఇండోర్ విమానాశ్రయానికి అహల్యాబాయి హోల్కర్ విమానాశ్రయంగా, ఇండోర్‌లో అహల్యాబాయి యూనివర్సిటీగా, సోలాపూర్‌లోని విశ్వవిద్యాలయానికి పుణ్యశ్లోక్ అహల్యాదేవి హోల్కర్ యూనివర్సిటీగా పేరు పెట్టడం జరిగింది. పాలనలో దాతృత్వం, సామాజిక సంస్కరణలు, కళలు, సంస్కృతికి మద్దతుగా నిలిచిన అహల్యాబాయి నేటి ఇండోర్ నగర అభివృద్ధికి నాడే పటిష్ట బీజాలు నాటారు.

వితంతువులకు ఆస్తి హక్కు, మహిళా సాధి కారతలకు పెద్ద పీట వేశారు. రాజమాత అహల్యాదేవి హోల్కర్ గా ప్రసిద్ధి గాంచి భారత స్వాతంత్ర్యానికి ముందు అత్యంత శక్తివంతమైన మహిళగా రుజువు చేసుకున్నారు. తత్వవేత్తగా, మహారాణిగా, సమర్థురాలైన పాలకురాలిగా,సాహసోపేత నాయకురాలిగా కీర్తించ బడ్డారు. అహల్యాబాయి 300వ వర్ధంతి సందర్భంగా నేటి యువత, ముఖ్యంగా యువతులు ఆమె జీవిత చరిత్రను ఆక ళింపు చేసుకొని ఆమె బాటలో పయనించాలని కోరుకుందాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# మడిచర్లలో 2 ఏళ్ల నమ్మకం-అభివృద్ధి

## ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**హనుమాన్ జంక్షన్, ఆగస్ట్ 13(మనం న్యూస్):** బాపులపాడు మండలం మడిచర్ల గ్రామంలో '2 ఏళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం రాత్రి నిర్వహించారు. కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్,బాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి , మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు,కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. అనంతరం గ్రిఇ-కుఱ్ఱ్ 2.0 నిధులతో రూ.49.40 లక్షల వ్యయంతో పునరుద్ధరించిన మడిచర్ల ధర్మకోనేరు చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం ఈశాన్య ప్రాంతంలో ఉన్న మడిచర్ల గ్రామం గతంలో అభివృద్ధికి దూరంగా ఉండేదన్నారు.గతంలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించినా గ్రామానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. 2019లో తాను గ్రామాన్ని సందర్శించిన సమయంలోనూ, 2024 ఎన్నికల ప్రచారంలోనూ గ్రామంలోని ఎస్సీ కాలనీకి సుమారు 70 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేదని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చామని చెప్పారు. గన్నవరం నియోజకవర్గానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహా వివిధ పథకాల కింద సుమారు రూ.10 కోట్ల నిధులు వచ్చిన సమయంలో, మడిచర్ల చిన్న గ్రామమైనప్పటికీ సుమారు రూ.90 లక్షల మేర నిధులను కేటాయించి పనులు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాల్లో మడిచర్ల కూడా ఒకటని, ప్రస్తుతం గ్రామంలో చేపట్టిన పనులను చూస్తే పరిస్థితి ఎంతగా మారిందో ప్రజలే గమనిస్తున్నారని పేర్కొన్నారు. చెరువు చుట్టూ సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మడిచర్లలో ఇప్పటివరకు రూ.5.13 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు యార్లగడ్డ వివరించారు. ధర్మకోనేరు చెరువు పునరుద్ధరణకు రూ.49.40 లక్షలు, మడిచర్ల నుంచి చల్లబోయినపల్లి వరకు బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.80 లక్షలు, 25 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.37 లక్షలు, ఎస్సీ శ్మశానవాటిక ప్రహరీ గోడకు రూ.2 లక్షలు, ఆరెపల్లి భాస్కరరావు ఇంటి వద్ద స్లాబ్ కల్వర్టుకు రూ.5 లక్షలు, న్యూ కాలనీలో అంతర్గత రోడ్లకు రూ.6 లక్షలు, ఇతర అంతర్గత సీసీ రోడ్లకు రూ.5 లక్షలు, పెద్ద ట్యాంకు అభివృద్ధికి రూ.3 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పైప్లైన్ కోసం రూ.78 లక్షలు, వ్యవసాయ సేవల కింద ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు రూ.2 కోట్లు, ఆర్డీఎస్ఎస్ పథకం కింద వివిధ విద్యుత్ పనులకు రూ.48 లక్షలు వెచ్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. గ్రామంలోని పామాయిల్ రైతులు, ఇతర రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పంచాయతీ, మండల స్థాయి నిధులతో కూడా డ్రైన్లు, రహదారుల మరమ్మతులు తదితర పనులు చేపట్టామని తెలిపారు. మడిచర్లలో మరో రూ.1.53 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులు ప్రతిపాదించినట్లు యార్లగడ్డ వెల్లడించారు. జల్ జీవన్ మిషన్ కింద అదనపు పైప్లైన్ పనులకు రూ.90 లక్షలు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సుకు రూ.3 లక్షలు, జలహారతి కింద పెద్ద ట్యాంకు మరమ్మతులకు రూ.11.38 లక్షలు, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్కు రూ.15 లక్షలు, అంతర్గత సీసీ రోడ్లు, పైప్లైన్ పనులకు రూ.6.50 లక్షలు, 35 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ.11.54 లక్షలు, మరో సీసీ రోడ్డుకు రూ.16 లక్షలు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇప్పటికే చేసిన రూ.5.13 కోట్ల పనులతో కలిపి ప్రతిపాదిత పనులు పూర్తయితే గ్రామంలో దాదాపు రూ.7 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగినట్లవుతుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు బదులుగా కేవలం సంక్షేమ పథకాల బటన్ నొక్కడం పైనే దృష్టి పెట్టారని యార్లగడ్డ విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాట పట్టిస్తున్నామని తెలిపారు. రానున్న రెండున్నరేళ్లలో గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి అజెండాతో మరింత వేగంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిపై ఎమ్మెల్యే విమర్శలు చేశారు. శాసనసభకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రజల ద్వారా ఎన్నికైన ప్రతినిధులపై ఉందన్నారు. సభకు హాజరుకాకుండా బయట విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించకుండా జీతాలు తీసుకోవడం సమంజసం కాదని, 'నో వర్క్-నో పే' విధానం అన్ని రంగాల్లోనూ ఉందన్నారు. శాసనసభకు ఎందుకు హాజరు కావడం లేదో జగన్మోహన్రెడ్డి ప్రజలకు స్పష్టంగా చెప్పాలని యార్లగడ్డ డిమాండ్ చేశారు. గతంలో శాసనసభలో జరిగిన అవమానాల కారణంగా కొందరు నేతలు సభను బహిష్కరించిన సందర్భాలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి కారణం ఏదీ లేకుండానే సభకు దూరంగా ఉండటం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు శాసనసభే సరైన వేదిక అని చెప్పారు. డీఎస్సీ అంశంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపైనా యార్లగడ్డ స్పందించారు. డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న వారు ముందుగా ఆధారాలు చూపాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి, పెట్టుబడులపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ చేశారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడం, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వ పాలనలో ఎదురైన ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని యార్లగడ్డ తెలిపారు. విమర్శలు చేయడం కంటే అభివృద్ధిపై చర్చకు రావాలని వైసీపీ నేతలను కోరారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగాలు, డీఎస్సీ, పెట్టుబడులు తదితర ఏ అంశంపైనైనా ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మడిచర్ల గ్రామ ప్రజలు గత ఎన్నికల్లో తనకు మైనస్ ఫలితం ఇచ్చినా అభివృద్ధిలో ఎలాంటి వివక్ష చూపలేదని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ గ్రామానికి అవసరమైన పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ మడిచర్లను మరింత అభివృద్ధి చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జననేత పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

# విశాఖ విమానాశ్రయంలో జనసేన, బీజేపీ నేతల మర్యాదపూర్వక భేటీ



**విశాఖపట్నం, ఆగస్ట్ 13(మనం న్యూస్):** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు విశాఖపట్నం విమానాశ్రయంలో జనసేన, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్బాబు, జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజయ్కుమార్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విమానాశ్రయంలో పవన్ కళ్యాణ్‌కు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్బాబు మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ ప్రపంచ ఏనుగుల దినోత్సవ జాతీయ వేడుకల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమంలో ఆయన పాల్గొనడం విశేషమన్నారు. పవన్ కళ్యాణ్ రాక సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకుని ఘన స్వాగతం పలికారు. జనసేన అధినేతకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా తరలిరావడంతో విమానాశ్రయ పరిసరాల్లో సందడి నెలకొంది.

### పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యాల సాధనలో

# ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

### జిల్లా ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పిలుపు

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నేడు మొక్కల నాటే కార్యక్రమం



**విశాఖపట్నం, ఆగస్టు 13 మనం న్యూస్:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. దేశాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆమె ఆదేశించారు.




# డిజిటల్ కోర్సులపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు

- సెట్విస్ సీఈవో రమ్య

**విశాఖపట్నం, ఆగస్ట్ 13(మనం న్యూస్):** ఉపాధి అవకాశాలను అందించే డిజిటల్ కోర్సుల్లో ఉచిత శిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సెట్విస్ సీఈవో రమ్య ఆధ్వర్యంలో 13.08.2026న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ విజయ్ బాబు, నాస్కం సిబ్బంది పాల్గొన్నారు. నాస్కం ఫ్యూచర్ ప్రైంకు చెందిన ప్రవీణ్ విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్ ప్రోగ్రామ్లో నమోదు, కోర్సు పూర్తి చేసే విధానంపై అవగాహన కల్పించారు. కళాశాల, సెట్విస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భారతీయ శాస్త్రవేత్తకు డిరాక్ అవార్డు



**లండన్, ఆగస్టు 13:** గణాంక యాంత్రిక శాస్త్రం (స్టాటిస్టికల్ మెకానిక్స్)లో అపూర్వ ఆవిష్కరణలు చేసినందుకు భారతీయ భౌతిక శాస్త్రవేత్త దీపక్ ధర్ ప్రతిష్టాత్మక డిరాక్ పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సంవత్సరం ఈ పతకాన్ని అందుకుంటున్న నలుగురు శాస్త్రవేత్తలలో ధర్ ఒకరని ఈ అవార్డును ప్రదానం చేసే ఇటలీకి చెందిన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్ సంస్థ గత శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ధర్ బెంగళూరులోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌కు చెందిన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ సైన్సెస్‌లో ప్రొఫెసర్. 2026 పతకాన్ని ఆయన ఫ్రాన్స్‌కు చెందిన బెర్నార్డ్ డెరిడా, ఇటలీకి చెందిన మార్క్ మెజార్డ్, ఇజ్రాయెల్, అమెరికాలకు చెందిన హైమ్ సోంపోలిన్స్కీలతో ఈ అవార్డును పంచుకున్నారు.

# దళితుల ఇళ్ల పట్టాలు, భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు

## గ్రామాల్లో సమస్యలను పరిశీలించిన ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం





**భీమునిపట్నం, విశాఖపట్నం ఆగస్టు 13(మనం న్యూస్):** దళితుల హక్కులకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, దళితులకు ప్రభుత్వం కల్పించిన భూములు, ఇళ్ల స్థలాలకు పూర్తి రక్షణ కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం అధికారులను ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ ఆదేశాల మేరకు, భీమునిపట్నం మండలంలోని నేరెళ్లవలస ఎస్సీ కాలనీని రావాడ సీతారాం సందర్శించి, అక్కడి దళిత కుటుంబాల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

**నేరెళ్లవలసలో ఇళ్ల పట్టాల ఆక్రమణపై విచారణ**

నేరెళ్లవలస సేఫ్ హౌసింగ్ హార్బర్ కాలనీలో దళిత కుటుంబాలకు మంజూరైన ఇళ్ల పట్టాలు ఆక్రమణకు గురవుతున్నాయనే ఫిర్యాదులపై కమిషన్ సభ్యులు సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.దళితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు లేదా పట్టాలను ఎవరైనా అక్రమంగా ఆక్రమించినట్లు తేలితే, సమగ్ర విచారణ నిర్వహించి, ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అర్హులైన దళిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు వారికి సురక్షితంగా అందేలా చూడాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు.

**నిడిగట్టులో దళితుల భూములకు దారి అడ్డుకున్న ఘటనపై ఆదేశాలు**

అనంతరం నిడిగట్టు గ్రామంలో దళితుల భూములకు వెళ్లే దారిని అడ్డుకున్నారనే ఫిర్యాదుపై కూడా ఎస్సీ కమిషన్ సభ్యులు స్పందించారు.దళిత రైతులు తమ భూములకు వెళ్లేందుకు ఉపయోగించే మార్గానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో విచారించి, దారి అడ్డుకోవడానికి గల కారణాలు, సంబంధిత భూముల వివరాలు, రికార్డులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.దళితుల భూములకు వెళ్లే హక్కుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ఫిర్యాదుపై నిబంధనల ప్రకారం తక్షణమే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.దళితుల సమస్యలపై నిర్లక్ష్యం సహించేది లేదన్నారు.ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, దళితుల భూములు, ఇళ్ల స్థలాలు, పట్టాలు మరియు వారి హక్కులకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును అధికారులు అత్యంత బాధ్యతతో పరిశీలించాలన్నారు.ప్రజలు తమ హక్కుల కోసం అధికారులను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలను కాలయాపన చేయకుండా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. దళితుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం లేదా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత అంశాన్ని ఎస్సీ కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని స్పష్టం చేశారు.దళితులకు అన్యాయం జరిగితే ఎస్సీ కమిషన్ వారి పక్షాన నిలుస్తుంది. వారి భూములు, ఇళ్ల స్థలాలు మరియు చట్టబద్ధమైన హక్కులకు పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

# ఇంటర్నేషనల్ పార్టనర్షిప్ సమ్మిట్కు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దండి

### ప్రధాన రహదారులు, జంక్షన్లు, బీచ్ రోడ్పై ప్రత్యేక దృష్టి

### స్ట్రీట్ వెండర్ జోన్ పనులు ఆగస్టు 25 నాటికి పూర్తి చేయాలి

### పనుల నాణ్యతలో అధికారులు ప్రత్యేక బాధ్యత చేపట్టాలి

### జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, ఆగస్టు 13 మనం న్యూస్:** నవంబర్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ పార్టనర్షిప్ సమ్మిట్ను దృష్టిలో ఉంచుకొని నగరంలో చేపట్టాల్సిన ప్రధాన అభివృద్ధి, మౌలిక వసతులు, సుందరీకరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్, జోనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమ్మిట్కు ముందు అక్టోబర్ రెండో వారంలో రీజినల్ సమ్మిట్ నిర్వహించే అవకాశం ఉన్నందున నగరాన్ని ముందుగానే పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. సెప్టెంబర్ 15 నాటికి ప్రధాన, అత్యవసర అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రధాన రహదారులను గుర్తించి గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట్ల నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారులు, కనెక్టివిటీ రోడ్లు, డ్రైనేజీ, యూజీడీ, వీధి దీపాలు, ఫుట్పాత్లు, ఫౌంటెన్లు, గ్రీనరీ, విద్యుత్ పోల్స్, గోడల పెయింటింగ్, బస్ బేలు తదితర మౌలిక వసతులు, సుందరీకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగించాలని, ప్రధాన రహదారులు, జంక్షన్లు, పర్యాటక ప్రాంతాల్లో వ్యర్థాలు కనిపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. బీచ్ రోడ్ పరిధిలో మురుగు, వ్యర్థాలు సముద్రంలో కలవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ (పబ్లిక్ హెల్త్) పి. నల్లనయ్యను ఆదేశించారు.ప్రధాన జంక్షన్ల అభివృద్ధిపై నిప్పాన్ కోయి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పవర్పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ట్రాఫిక్ రద్దీ, రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని జంక్షన్లను శాస్త్రీయంగా అభివృద్ధి చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో గ్రీన్ ఐలాండ్స్, పచ్చదనం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు.సమ్మిట్కు వచ్చే ప్రతినిధులకు విశాఖ నగరం మంచి అనుభూతిని కలిగించేలా నగర ప్రవేశ మార్గాల నుంచి ముఖ్య ప్రాంతాల వరకు సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్ణీత గడువులో పూర్తి చేసే బాధ్యతను జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు వ్యక్తిగతంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. స్ట్రీట్ వెండర్ జోన్ల అభివృద్ధి పనులన్నీ ఆగస్టు 25 నాటికి పూర్తి చేయాలని అదనపు కమిషనర్ పి.ఎం. సత్యవేణి అధికారులను ఆదేశించారు. విక్రేతలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, విద్యుత్, నీటి సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు.ఈ సమీక్షలో అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్.ఎస్. వర్మ, ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు అధికారులు పాల్గొన్నారు.

### ఎర్రకోట బాంబు పేలుడు

# అల్-ఖైదా పనే

### ధృవీకరించిన ఐరాస భద్రతా మండలి



**న్యూయార్క్, ఆగస్టు 13 :** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గతేడాది నవంబరులో జరిగిన పేలుడుకు అల్-ఖైదా అనుబంధ సంస్థ కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ధ్రువీకరించింది. ఈ దాడితో 'అల్-ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్కాంటినెంట్ 'కు సంబంధం ఉందని పేర్కొంది. ఈ మేరకు దీనిపై నివేదిక విడుదల చేసింది. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో సుమారు 15 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

ఏక్యూఐఎస్ గతంలో చిన్న బృందంగా ఉండేదని.. ప్రస్తుతం ప్రాంతీయ ఉగ్రవాద సంస్థగా రూపాంతరం చెందుతోందని ఐరాస భద్రతా మండలి తన నివేదికలో తెలిపింది. అల్-ఖైదా, ఐసిస్ సంస్థలు రసాయన, జీవ ఆయుధాల తయారీపై చాలాకాలంగా ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంది. భారతదేశ సరిహద్దుల్లో ఉన్న బంగ్లాదేశ్ను స్థావరం చేసుకొని, అక్కడ తమ ముఠాలను బలోపేతం చేయడానికి అది తీవ్రంగా ప్రయత్నిస్తోందని ప్రకటించారు.

# వివాదాన్ని ఇక ముగించండిమాల్యా, ఎస్బీఐకి బాంబే హైకోర్టు సూచన



**ముంబై, ఆగస్టు 13 :** పరారీలో ఉన్న పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా, బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక స్వస్తి పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేండ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని ఓ ముగింపునకు తీసుకురావాలని తెలిపింది. ఈ వివాదాన్ని ఇలాగే కొనసాగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వినియోగించుకునేందుకు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఇచ్చిన అనుమతిని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను జస్టిస్ మిలింద్ జాదవ్ విచారించారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతిపై వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా దీనిని పట్టుకుని కూర్చోకుండా ముందుకు సాగాలని జడ్జి స్పష్టం చేశారు. ఇరుపక్షాలు కూర్చుని ఆచరణాత్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు. కింగ్ ఫిషర్ ఎయిర్లైన్స్ కోసం పలు బ్యాంకుల నుంచి మాల్యా దాదాపు రూ.9,000 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాలను చెల్లించకపోవడంతో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు పరారయ్యారు. దీంతో 2019లో ఆయన్ను 'పరారైన ఆర్థిక నేరస్థుడి'గా ప్రకటించారు. చట్ట ప్రకారం మాల్యా ఆస్తులను జప్తు చేసి రుణాల రికవరీకి చర్యలు చేపట్టారు. దీంతో ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును తన పిటిషన్లలో ప్రశ్నించారు.మరోవైపు, మాల్యాను భారత్కు అప్పగించేందుకు వీలుగా బ్రిటన్తో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# అంగన్వాడీ బడి... అమ్మ వడితో సరి సమానం

- ఓయి, ఓరి, ఓసి ... సాధారణ పదాలను నేర్పం
- మూడు రోజుల జ్ఞాన జ్యోతి శిక్షణ విజయవంతం..



శంఖవరం, ఆగస్టు 13 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం ఐసిడిఎస్ పథకం కార్యాలయం ఆధీనంలోని శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలోని మొత్తం 112 మంది అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పథకం మొదటి దశ 3 రోజుల శిక్షణా కార్యక్రమాలు విజయవంతంగా ముగిసాయి. శంఖవరం మండలంలోని 56 మంది కార్యకర్తలకు కత్తిపూడిలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలోనూ, అలాగే రౌతులపూడి మండలంలోని 56 మంది కార్యకర్తలకు రౌతులపూడి జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలోనూ ఈ శిక్షణా కార్యక్రమాలను ఏక కాలంలో నిర్వహిస్తున్నారు. కత్తిపూడి శిక్షణా కేంద్రంలోని అంగన్వాడీ కార్యకర్తలకు బోధనోపకరణాల తయారీ, రిమోట్ లర్నింగ్ మెసేజెస్, తరగతి గది నిర్వహణ, ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక ప్రాధాన్యత, అంగన్వాడీ కార్యకర్తల పాత్ర, ప్రాధాన్యత, పాఠశాల సంసిద్ధత వంటి అంశాలపై డి.ఆర్.పిలు పొట్టూరి శ్రీదుర్గాదేవి, సిహెచ్.నాగచాందిని, నాగరత్నం శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా శంఖవరం అంబేద్కర్ నగర్ మండల ప్రజా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదుర్గాదేవి మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం శిక్షణలో చెప్పిన విషయాలను తల్లులతో పంచుకుంటూ ఉంటే సిబ్బందితో తల్లుల్లో అన్యోన్యత, ఆత్మీయతతో పాటు ఆత్మ విశ్వాసం కూడా మరింత పెరుగుతుందని శ్రీదుర్గాదేవి పేర్కొన్నారు. నిరంతరం అంగన్వాడీ కార్యకర్తలు తల్లులకు మార్గదర్శక సమాచారాన్ని అందిచడం, సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో పిల్లల తల్లులతో సమన్వయం చేసుకుంటే అంగన్వాడీలు, తల్లుల మధ్య అనుబంధం బలపడుతుందని వివరించారు. ఈ సత్సంబంధాలను నిరంతర నిరవధికంగా కొనసాగించడానికే 2019 డిసెంబర్ నుంచి రెండేళ్ల పాటు కరోనా మహమ్మారితో ప్రపంచం అంతా స్తంభించి పోయింది. ప్రత్యక్ష ప్రీ-స్కూల్ కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. అంగన్వాడీలు, తల్లులు, పిల్లల మధ్య ప్రత్యక్ష కార్యాచరణ తాత్కాలికంగా ఆగి నప్పటికీ కూడా పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల అభ్యసన కుంటుపడకుండా రిమోట్ లర్నింగ్ మెసేజెస్ మాధ్యమం విధానం ద్వారా వాట్సాప్ సందేశాలను పంపుకునే ఏర్పాటును ప్రభుత్వం చేసిందన్నారు. ఫలితంగా అంగన్వాడీలు తల్లుల మధ్య సమాచార సంబంధాలు కొనసాగి ప్రతీ కృత్యాల వీడియోలను తల్లులకు పంపించడం ద్వారా వారి ఇండ్లలో చిన్న చిన్న కృత్యాలను చిన్నారులతో తల్లులు చేయించడం సాధ్యమైంది అన్నారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్ వైజర్ బి.వెంకట రజని మాట్లాడుతూ, అంగన్వాడీ బడి... అమ్మ వడితో సరి సమానం అన్నారు. ఇక్కడ తల్లి, దండ్రులు, గురువులను గౌరవించడాన్ని చిన్నారులకు నేర్పాలి. ఓయి, ఓరి, ఓసి... వంటి జన సామాన్య సాధారణ పదాలను నేర్పకుండా సంస్కారవంతమైన భాషాభివృద్ధి వాచకాన్ని నేర్పడం అంగన్వాడీ కార్యకర్తల చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఐదేళ్ళ వరకూ వారి భాషాభివృద్ధి చేసే బాధ్యత మీదే. ఇక్కడ మీరు వేసిన పునాది బలమే వారిని సమాజంలో ఉన్నతంగా తీర్చి దిద్దేందుకు దోహదం చేస్తుందని అంగన్వాడీల సామాజిక బాధ్యతను వక్కాణించి చెప్పారు. పిల్లల తాము చదువు నేర్చుకుంటున్నామని, దానిని శ్రమగా భావించకుండా ఉండేందుకు ఆడుతూ పాడుతూ విధానంలోనే పూర్వ ప్రాథమిక విద్యలో అక్షరాలను నేర్పాలని అంగన్వాడీలకు శిక్షకులు భోధించారు. రౌతులపూడి కేంద్రంలోనూ ఇదే శిక్షణను అందించారు. కత్తిపూడి శిక్షణా కేంద్రంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ, అలాగే మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఈ శిక్షణను శంఖవరం ఐసిడిఎస్ సిడిపీఓ. పర్వత వెంకటలక్ష్మి ప్రత్యక్ష పర్యవేక్షణలో విజయవంతంగా ముగుసాయి. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రి అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తిచేయాలి

**పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష**



పాలకొల్లు, ఆగష్టు 13,మనం ప్రతినిధి : పాలకొల్లులోని ఇమిడి సత్యనారాయణ వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఉదయం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి.. నిర్మాణ పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులతో సమీక్షించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి పనులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. పనుల్లో ఎక్కడా జాప్యం చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనుల వేగాన్ని మరింత పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు, సంబంధిత ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశించిన ప్రమాణాల మేరకు పనులు చేపట్టాలని, నిర్మాణ పనుల నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధితో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలని, అందుకు అనుగుణంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

## సజ్జలను కలిసిన పెయ్యల రాజా



శంఖవరం ఆగస్టు 13 మనం ప్రతినిధిః వైస్సార్సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ వైస్సార్సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శి పెయ్యల రాజా మర్యాద పూర్వకంగా కలిశారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి వైఎస్ఆర్సిపి నాయకులు, రాష్ట్ర విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శి పెయ్యల రాజా గురువారం తాడేపల్లి వైస్సార్సీపీ సెంట్రల్ కార్యాలయంలో సజ్జల రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ అవకతవకలు పై నిరసన ర్యాలీ గురించి అడిగి తెలుసుకున్నారని అలాగే విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజు రియింబుర్స్మెంట్ మరియు ఎన్నికల హామీల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి తక్షణమే మంజూరు చెయ్యాలని నిరాహార దీక్షలు, నిరసన ర్యాలీలు చేపట్టిన ప్రతి ఒక్క విద్యార్థి,నిరుద్యోగ యువతకు వైస్సార్సీపీ అండగా ఉంటుందని, మన రాష్ట్ర భవిష్యత్ యువత చేతిలోనే ఉందని ప్రభుత్వం గాడి తప్పినపుడు విద్యార్థులు యువత ప్రభుత్వాన్ని ప్రశ్నించి మంచి మార్గంలో నడిపించే బాధ్యత మీ మీద ఉందని దిశ నిర్దేశం చేసారని రాజా తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తూ, ప్రధాన పాత్ర పోషిస్తూ పార్టీ అభివృద్ధికి తోడ్పడుతున్నందున పెయ్యల రాజా ను ప్రత్యేకంగా అభినందించారు.

## తెలుగు సాహిత్య పరిశోధనలో ఉపాధ్యాయుడుకు డాక్టరేట్ ప్రదానం



శంఖవరం, ఆగస్టు 13 మనం ప్రతినిధి: ఉపాధ్యాయునిగా తన తరగతి విద్యార్థులకు భోధనా సేవలందిస్తూనే డోకుబుర్ర సుబ్బారావు పి.హెచ్.డి. పరిశోధనను పూర్తి చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న డోకుబుర్ర సుబ్బారావు తెలుగు సాహిత్య పరిశోధనలో విశిష్ట ఘనత సాధించారు. తాజాగా పరిశోధనా పట్టాను పట్టి గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. ఆయన తాజాగా విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి తెలుగులో పిహెచ్.డి. పట్టాను పొందారు. 'గుంటూరు కథా సంకలనం - ఒక పరిశీలన ' అనే అంశంపై ఆయన నిర్వహించిన పరిశోధనా పత్రాలను సమర్పించి సఫలీకృతం అయ్యినందుకు ఆయనకు ఆంధ్ర విశ్వ విద్యాలయం పి.హెచ్.డి అవార్డును ప్రదానం చేసింది. ఆంధ్రా విశ్వ విద్యాలయం కులపతి రాజశేఖరం నుండి సుబ్బారావు పరిశోధనా గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ ఆచార్యులు, పరిశోధనా మార్గదర్శకులు ఆచార్య జర్రా అప్పారావు పర్యవేక్షణలో డాక్టర్ డోకుబుర్ర సుబ్బారావు తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసారు. గుంటూరు ప్రాంత సాహిత్యాన్ని కథా సంకలనాలను మధించి అందులో ప్రతిబింబించిన సామాజిక, సాంస్కృతిక, సాహిత్య అంశాలను తన పరిశోధనలో మరింత లోతుగా విశ్లేషించారు. డోకుబుర్ర సుబ్బారావు శిక్షణ పొందిన గ్రాడ్యుయేట్ పొందిన ఉధ్యాయుడిగా ఒక వైపు శంఖవరం ఆదర్శ పాఠశాలలో తనకు కేటాయించిన కొన్ని తరగతుల విద్యార్థులకే గాక మరికొన్ని అదనపు తరగతుల విద్యార్థులకు కూడా తెలుగు పాఠ్యాంశాలను భోధిస్తూ తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే మరోవైపు తనకు ఇంటి దగ్గర లభించిన కొద్ది పాటి సమయాల్లో తన పరిశోధనను పట్టుదలతో కఠోర అధ్యయనాన్ని ముందుకు కొనసాగించి పి.హెచ్.డిని సాధించి డాక్టరేట్ గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. తాను ఈ డాక్టరేట్ ను పొందడంలో తన సాధనకు తోడు తల్లి దండ్రులు డోకుబుర్ర సుగుణ ప్రేమాదందరావు, రాజామణిల ఆశీస్సులు, కుటుంబ సభ్యులు పరిశోధనా మార్గదర్శకులు ఆచార్య జర్రా అప్పారావు విలువైన సూచనలు, ప్రోత్సాహం ఎంతో దోహద పడ్డాయని డాక్టర్ డోకుబుర్ర సుబ్బారావు ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. డోకుబుర్ర సుబ్బారావును శంఖవరం మండలం ఎం.ఈ.ఓ. ఎస్.వి.రమణ, ఎం.ఈ ఓ-2 టి.గోవింద్, ఏ.పి. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏ.వీరరాజు, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు పలువురు అభినందించారు.

## కొమ్మనాపల్లిలో సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ వందేళ్ళ శతాబ్ది వేడుకలు



శంఖవరం ఆగస్టు 13 మనం ప్రతినిధిః కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో బెంజమిన్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ డి. పాల్ సుందర్, చర్చ్ అధ్యక్షులు వై షడ్రక్ సదానంద్, సంఘ పెద్దలు దడాల మహేష్ కె. అర్జున్ శతాబ్ది వేడుకల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సి.బి.సి.ఎం.సి క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్ వరప్రసాద్, రంజిత్ కుమార్, మేర యేసుదాసు ఈ శతాబ్ద వేడుకల్లో పాల్గొని క్రైస్తవ బోధన చేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ పేరును బెంజిమెన్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ గా నామకరణ చేశారు. ఈ శతాబ్ద వేడుకల్లో సంఘ క్రైస్తవ మత పెద్దలు, భారీ స్థాయిలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## 'మనకోసం మనం' ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ




పోడూరు, ఆగష్టు 13 మనం న్యూస్ : పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని పోడూరు మండలం, జిన్నూరు, జిన్నూరు పాలెం, పెదపేట, నరసింహారావు పేట, భూపయ్య చెరువు, సాకిరేవు గుంట, పెచ్చెట్టిపాలెం, తదితర ప్రాంతాల్లో గురువారం మనకోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత దేవళ్ళ ప్రసాద్ వితరణతో ఈ నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిన్నూరు సొసైటీ అధ్యక్షులు, దాత దేవళ్ళ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మనకోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల పెద్దిరాజు మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో, విద్యార్థులకు సహాయం చేయడంలో సొసైటీ అధ్యక్షులు దేవళ్ళ ప్రసాద్ ముందుంటారని, మంచి దాతృత్వం కలిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సంస్థకు అందిస్తున్న సహాయ సహకారాలకు అభినందనలు తెలియజేశారు. ప్రతి వ్యక్తి సేవాభావం కలిగి ఉండాలని విద్యార్థులంతా క్రమశిక్షణతో కలిగిన విద్యను అభ్యసించి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్లు ఇవ్వాలి




- మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్

పాలకొల్లు ఆగస్టు 13 మనం ప్రతినిధిః కొత్త పింఛన్లు ఇవ్వాలి అని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు.నేటికీ దళితులకు స్మశానాలు లేక అవస్థలు పడుతున్నారని స్వతంత్ర భారతదేశంలో నేటికి దళితులు కులవివక్ష అంటరానితనానికి గురవుతున్నారని పాలకులు దళితులను అభివృద్ధి చేశామని ఉపన్యాసాలు చెప్పినప్పటికీ దళితపేటలో సమస్యలు నేటికి పరిష్కారం కాలేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్రనాయకులు మాజీ శాసనసభ్యులు దిగుపాటి రాజగోపాల్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి అన్నారు స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద సామాజిక శంఖారావం సర్వేలో వచ్చిన సమస్యలపై ధర్నా చేసి ₹తాసిల్దార్ శ్రీ దుర్గా కిషోర్₹ కు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ₹రాజగోపాల్,జార్జి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఏ.రవి మాట్లాడారు₹ రూరల్ మండలం దగ్గులూరు గ్రామంలో యానాదులకు వేసిన రేకు షెడ్లు అధ్వానంగా ఉన్నాయని అరటికట్ల గ్రామంలో దళితులతో పాటు ఇతర కులస్తులకు కూడా స్మశానాలు లేవని కూటమి ప్రభుత్వం వచ్చి మూడు ఏళ్లవుతున్న నేటికీ ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు పాలకొల్లు పట్నం 31 వ వార్డులోని వడలివాని పేటకుసంబంధించినటువంటి దళితుల స్మశానం ఆక్రమణకు గురవుతుందని సర్వే చేసి చుట్టూ ప్రహరీ నిర్మించాలని స్మశానంలో షెడ్డు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు దీనిపై ఎమ్మార్వో స్పందిస్తూ తాసిల్దార్ స్పందిస్తూ దగ్గులూరు యానాదుల పేట వడలవానిపేట స్మశానం సందర్శిస్తానని తన పరిధిలో చేయగలిగే పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు అలాగే అరట్లకట్ట దళితులకు ఇతర కులాల వారికి కూడా త్వరలోనే రెండు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి స్మశానంగా ఏర్పాటుకు ప్రతిపాదనలు పై అధికారులకు పంపుతానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం లో ₹చల్ల సోమేశ్వరం తిరుమని శీను ఎర్ర అజయ్ మహిళా సంఘం నాయకురాలు బి సుగుణ ఏకల రాము మల్లుల గణపతి₹ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తీరంగా ర్యాలీ



కాట్రేనికోన ఆగష్టు 13 మనం ప్రతినిధిః కాట్రేనికోన మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కాట్రేనికోన ముఖ్య కూడలి (గేట్ సెంటర్) వరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజానీకం సమక్షంలో 'హర్ ఘర్ తిరంగా' (మువ్వన్నెల జెండా) ర్యాలీని ఘనంగా నిర్వహించారు.విద్యార్థిని విద్యార్థులు సైకిళ్లపై మువ్వన్నెల జెండా ఎగరేస్తూ ఉత్సాహంగా 'జై భారత్' నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కాట్రేనికోన ముఖ్య కూడలి వద్ద వికసిత్ భారత్ -2047 సంకల్ప ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగిడి నాగేశ్వరరావు, ఎంపీడీఓ రాజేశ్వర్ రావు, తహసీల్దార్ రవి కిరణ్ ఎస్ ఐ అవినాష్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజానీకం పాల్గొన్నారు. . కాట్రేనికోన మండలం , చెయ్యేరు గ్రామంలో హర్ఘర్ తిరంగా కార్యక్రమం గురువారం నిర్వహించారు. జాతీయ జెండా లు చేత బట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెయ్యేరు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరావు స్కూల్ విద్యార్థిని విద్యార్థులు మాజీ సర్పంచ్ చెల్లి సురేష్ పంచాయతీ సెక్రెటరీ భాగయ్య ఉపసర్ప ంచ్ బి వి నారాయణస్వామి, సొసైటీ అధ్యక్షులు త్సవటపల్లి శ్రీనివాస్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మట్ట సూరిబాబు, బిజెపి మండల అధ్యక్షులు మట్ట శివకుమార్, సీనియర్ నాయకుల సేనంద్యాల చంటి, సుంకర నాగేశ్వరావు, తెలుగుదేశం సీనియర్ నాయకులు నామన వెరిబాబు, నంద్యాల వెంకటేశ్వరరావు,జనసేన నాయకులు కాయల బలరాం పంచాయతీ సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడి వర్కర్స్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఘనంగా సత్యదేవుని 136వ జయంతి ఉత్సవాలు

- పాల్గొన్న చైర్మన్ రోహిత్ ఈఓ చక్రధర్ రావు - పలువురు పండితులకు సత్కారం



అన్నవరం, ఆగస్టు 13, మనం న్యూస్ : రత్నగిరిపై కొలువై ఉన్న శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి 136వ జయంతి ఉత్సవ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి నామస్మరణతో రత్నగిరి మార్మోగింది. ఈ సందర్భంగా అనివేటి మండపంలో వెండి సింహాసనంపై స్వామివారు, అమ్మవార్లను సుందరంగా అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ రాజపండితులు, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. సనాతన ధర్మంలో భగవంతుని అవతార మహిమను స్మరించుకోవడం, ఆధ్యాత్మిక చింతనతో జీవనాన్ని సార్థకం చేసుకోవడం జయంతి ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యంగా భావిస్తారు. సత్యదేవుని ఆరాధనలో సత్యం, ధర్మం, భక్తి, విశ్వాసాలకు ప్రత్యేక స్థానం ఉంది. స్వామివారి అనుగ్రహం పొందితే కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, సంతానం, ఆరోగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. జయంతి వేడుకల సందర్భంగా వేదపండితులు, అర్చకులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి గౌరవం అందజేశారు. వేదమంత్రాలతో ఆలయ పవిత్రతను, ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందిస్తున్న పండితులు, అర్చకుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. 136వ జయంతి ఉత్సవాల సందర్భంగా రత్నగిరిపై భక్తి, వేదఘోష, మంగళవాయిద్యాలు, స్వామివారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారి దివ్య దర్శనం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు సత్యదేవుని కృప సర్వజనులపై ఉండాలి.. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలి అని ప్రార్థించారు.

## గ్రెవెల్ రోడ్ పనులకు శంకుస్థాపన చేపట్టిన ఎంపీపీ



ఏలేశ్వరం,ఆగస్టు (మనం న్యూస్)ః కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామములో మూడు లక్షల రూపాయల వ్యయం తో నూతనంగా నిర్మించనున్న గ్రావెల్ రోడ్డు పనులకు కు మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) శంకుస్థాపనచేశారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలతో పేటలో గ్రెవెల్ రోడ్ పనులను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి లో భాగంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చొరవతో ఈ రోడ్ పనులు ప్రారంభించడం జరుగుతుందని ఎంపీపీ బుజ్జి తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమము లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. ఏలేశ్వరం మండలం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసాలో మొదటి సంవత్సరపు తరగతులు ప్రారంభం



కాట్రేనికోన ఆగష్టు 13 మనం ప్రతినిధి : అమలాపురం సమీపంలో చెయ్యరు నందుగల శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరపు బి .టెక్ మొదటి సంఛ తరగతుల్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డి వి ఎన్ ఎస్ వర్మ జ్యోతిని ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అత్యన్నత ప్రమాణాలతో నడుపబడుతున్న విద్యా సంస్థల్లో శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల జిల్లాలో నే విశిష్ట గుర్తింపు సాధించిందని, ప్రతీ విద్యార్థి అత్యున్నత లక్ష్యమును నిర్దేశించుకుని, క్రమశిక్షణంతో, ఉన్నది శిఖరముల్ని అధిరోహించాలని ఉద్బోదించారు . కళాశాల ముఖ్య కార్య నిర్వాహణాధికారి ప్రొఫెసర్ డా ఛ జి .ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ, ప్రతీ విద్యార్థి బి .టెక్ మొదలు సంఛ మ ప్రాథమిక అంశములైన గణిత, భౌతిక, రసాయనిక, ఆంగ్ల భాషా నైపుణ్యములు సాధించుట ద్వారా ద్వారా సమున్నత లక్ష్యము నం బలమైన పునాది ఏర్పడుట ద్వారా సమున్నత లక్ష్యమును చేరుకోవచ్చునని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డ్ఛా బి . రత్నరాజు మాట్లాడుతు, కళాశాలలో గల పరిశోధన ప్రయోగశాలలు, మౌలిక వసతులు, వినియోగించుకోవాలని పరిశోధనాత్మక ధోరణి అలవర్చుకో వాలని సూచించార ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సందీప్, విద్యార్థి సంక్షేమాధిపతి డా బి . అరుణ్ కుమార్ , బేసిక్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ అధి పతి ఏ వి సి జానకి రామయ్య , వైస్ ప్రిన్సిపాల్ కే వి వి బాపి రాజు , పరీక్షల విభాగం డ్ఛా ఆర్ జాన్ మాథ్యూ , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు , వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



మంత్రి నారా లోకేష్ తో వర్శిటీ విశేషాలు పంచుకున్న సునీతమ్మ

చెన్నేకొత్తపల్లి ఆగస్టు 13 మనం న్యూస్ : అమెరికాలోని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ ఒక అద్భుతం అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆమె బుధవారం స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే చదివిన నేపథ్యంలో యూనివర్శిటీ విశేషాలను రాప్తాడు ఎమ్మెల్యే సునీత పంచుకున్నారు. నారా లోకేష్ ఎంబిఏ చదివిన, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలలో ఒకటిగా ఉన్న అమెరికాలోని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించానని.. ఈ ఫోటోలను తమకి పంపుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉన్న ఈ యూనివర్సిటీలో నారా లోకేష్ చదవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా స్టాన్ఫోర్డ్ ఎంబిఏ ప్రోగ్రామ్, ప్రపంచవ్యాప్తంగా మేనేజ్మెంట్ కోర్సుల్లో అగ్రశ్రేణిలో కొనసాగుతోందని తెలుసుకున్నానన్నారు. ఇక్కడ సీటు సాధించడం అత్యంత కఠినమైన విషయమని.. అలాంటిది నారా లోకేష్ ఇక్కడ చదవడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే ప్రపంచాన్ని శాసిస్తున్న అనేక దిగ్గజ కంపెనీల వ్యవస్థాపకులు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉన్నారని, దాదాపు 21 మందికి పైగా నోబెల్ బహుమతి గ్రహీతలు ఇక్కడ చదివిన వారు ఉన్నారని తెలుసుకున్నట్లు చెప్పారు. ఇంత గొప్ప యూనివర్సిటీలో చదువుకున్నారు కాబట్టే.. రాష్ట్రానికి ఇలా అత్యుత్తమ సేవలు అందించగలుగుతున్నారన్నారు. ఈరోజు రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావడం, విద్యాశాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకొస్తున్నారంటే ఇక్కడ పొందిన విజ్ఞానం అని అర్థమవుతోందన్నారు. ఇలాంటి యూనివర్సిటీలో చదివినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి అయినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. అయితే రాయలసీమ ప్రాంతంలో ఎస్కేయూనివర్శిటీ, జేఎన్టీయూలు తప్ప పెద్దగా చెప్పుకోదగ్గ యూనివర్శిటీలు లేవని.. నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ చూపి స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థల్ని నెలకొల్పాలని మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి ఆగస్టు 13 మనం న్యూస్: కదిరి నియోజకవర్గం లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే నా ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. గురువారం కదిరి మున్సిపల్ పరిధిలోని 34వ వార్డు పార్థసారథి కాలనీ నందు ఇంటింటికీ టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పాలన లో 34వ వార్డు పార్థసారథి కాలనీ లో నిర్వహించిన ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పార్థసారథి కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. , కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మాజీ కౌన్సిలర్లు హుస్సేన్ భాష, ముని, రమణ నాయకు లునరసింహులు, శ్రీరాములు, గంగిశెట్టి,కిష్టప్ప,కూటమి నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కరమర్ల నారాయణ ఆచారికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కందికుంట



కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్:టీడీపీ సీనియర్ నాయకులు కరమర్ల నారాయణ ఆచారి గురువారం మృతి చెందడంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కదిరి పట్టణానికి చెందిన , 4వ వార్డు బూత్ ఇంచార్జ్ కరమర్ల నారాయణ ఆచారి శివైక్యం చెందారనీ. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నారాయణ ఆచారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తో పాటు పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పెనుకొండ ఆగష్టు 13 మనం న్యూస్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు గురువారం పెనుకొండ పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ ర్యాలీని జాతీయ జెండాను ఊపి ప్రారంభించారు.విద్యార్థినీ విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకొని, దేశభక్తి నినాదాలు చేస్తూ పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీగా సాగారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి జాతీయ భావాలను పెంపొందించుకోవాలని, దేశ నాయకులను స్మరించుకుంటూ దేశభక్తి స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద లేదా కార్యాలయం వద్ద ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కె. సుదర్శన్ మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. విద్యార్థులు ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.అలాగే విద్యార్థినీ విద్యార్థులు 'విజన్ 2047' లక్ష్యాన్ని ఎంచుకొని, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోని అగ్రగామి దేశాల సరసన నిలిచేలా తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, కళాశాల చరిత్ర అధ్యాపకులు ఎస్.ఎన్. మూర్తి, ఉమా శంకర్, సీనియర్ అసిస్టెంట్ అల్లా బకాష్, ఎన్ఎస్ఎస్ పీఓలు డి. శివన్న, ఎస్. హఫీజ్, కె. రవికుమార్, ఆర్ఆర్సీ విజయ ప్రకాష్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కూటమి నాయకులు, సచివాలయాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## లేపాక్షిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



లేపాక్షి,ఆగస్టు 13,మనం న్యూస్: లేపాక్షి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈఓ లు 1 2, జి జె సి ప్రిన్సిపాల్, హెచ్ఎంలు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ ఐక్యత, దేశభక్తి, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ముందుకు సాగారు.

ఈ కార్యక్రమం మండల కేంద్రంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## అగ్రోఎకాలజీ ఆధారిత జీవనోపాధుల కార్యక్రమం




చెన్నేకొత్తపల్లి, ఆగస్టు మనం న్యూస్ 13 : స్థానిక మండల కేంద్రము సమీపాన ఉన్న చింత వనము టింబక్టు కలెక్టివ్ కార్యాలయము ప్రాంగణములో గురువారము మహిళా రైతుల సుస్థిర జీవనోపాధులను బలోపేతం చేయడం, సేంద్రియ కూరగాయల సాగును మరింత విస్తరించడం, రైతులకు అవసరమైన ఇన్పుట్లు, శిక్షణ మెరుగైన మార్కెటింగ్ అవకాశాలను కల్పించే లక్ష్యంతో మహిళా రైతుల కోసం అగ్రోఎకాలజీ ఆధారిత జీవనోపాధులు కార్యక్రమాన్ని ప్రారంభించారు . టింబక్టు కలెక్టివ్ సంస్థ చైర్పర్సన్ బబ్లు గంగూలీ మాట్లాడుతూ... మహిళా రైతులతో సేంద్రియ కూరగాయల సాగు కార్యక్రమం కొనసాగుతున్న తీరును వివరించి, రాబోయే కాలంలో ఉత్పత్తులతో పాటు మార్కెటింగ్ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

మహిళా రైతులు తమ అనుభవాలను, భవిష్యత్ ఆలోచనలను పంచుకున్నారు.

## రైతుల ప్రయోజనాల కోసం కర్షకయాప్

- ఆధునిక సాంకేతికతతో వ్యవసాయానికి కొత్త దిశ
- ఎమ్మెల్యే కందికుంట



కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్: కదిరి పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న వాయిస్ ఆఫ్ సిటిజన్ కార్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగిస్తూ రైతుల ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురానున్న కర్షక యాప్పై గురువారం కదిరి నియోజక వర్గం లోని అన్ని మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని కర్షక యాప్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడం, పంటలకు వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించడం, పంట నష్టాలను నివారించేందుకు అవసరమైన సూచనలు అందించడం, పంట దిగుబడిని పెంచే విధంగా రైతులకు శాస్త్రీయ సలహాలు అందించడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ఆధునిక సాంకేతికతతో కదిరి రైతాంగానికి అండగా నిలుస్తామని ఆయన తెలిపారు.

## వెలుగు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుపై హర్షం

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే కందికుంట, ఉద్యోగులు



కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్: కదిరిలో పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు సెర్ప్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచడంతో పాటు జీతాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెలుగు ఉద్యోగులు కలిసి పాలాభిషేకం చేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికగా వెలుగు సెర్ప్ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన తెలిపారు. పేదరిక నిర్మూలన, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం వెలుగు సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని, వెలుగు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడంతో పాటు జీతాల పెంపు నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారనీ. ఈ నిర్ణయం ఉద్యోగులకు మరింత భరోసా, ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. సెర్ప్ సంస్థకు 'వెలుగు'గా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఎంతో గొప్పదని వెలుగు సంస్థ అధికారులు, ఉద్యోగులు పేర్కొన్నారు. వెలుగు సంస్థ, ఉద్యోగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు ముగ్గురి ఎంపిక



ధర్మవరం ఆగస్టు 13 మనం న్యూస్ః కాలేజ్ గ్రౌండ్లో నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో జీ.వీ. జెడ్పీజీహెచ్ఎస్ విద్యార్థిని బి. ప్రణీత రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వై. సుమన, పీడీ స్వరూప, పీటీ సరళ, ఉపాధ్యాయులు ప్రణీతను అభినందించారు.ఈ నెల 25, 26 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ-కోచింగ్ సెంటర్ క్రీడాకారులు ఏ. ఉదయ్ (-68 కిలోలు), కొండ అర్చన (-52 కిలోలు) కూడా ఎంపికైనట్లు కోచ్ ఇనాయత్ భాషా తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# తాగి నడిపితే భారీ మూల్యం తప్పదు




- ఐదుగురికి జైలు, 17 మందికి రూ.1.70 లక్షల జరిమానా
- ప్రత్తిపాడు సీఐ బిఎస్ అప్పారావు

శంఖవరం ఆగస్టు 23 మనం ప్రతినిధిః మద్యం సేవించి వాహనాలను నడిపితే భారీ మూల్యం చెల్లించక తప్పదు అని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సిఐ. బి.సూర్యఅప్పారావు తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడిపుతున్న చోదకులపై ప్రత్తిపాడు సర్కిల్ పోలీసులు గురువారం కొరడా ఝుళిపించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 22 మందిని కోర్టులో హాజరు పరచగా ఐదుగురికి జైలు శిక్ష,17 మందికి జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. గరిష్ఠంగా ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష పడింది. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో పోలీసులు గురువారం విస్తృతంగా తనిఖీలను చేపట్టారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న 12 మందిమొత్తం రూ.90 వేల జరిమానా విధించారు. ప్రత్తిపాడు పోలీసులు ఐదుగురిని కోర్టులో హాజరుపరచగా.. ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పునని ప్రత్తిపాడు కోర్టులో అన్నవరం పోలీసుల హాజరు పరచగా.. ముగ్గురికి రెండు, మూడు, ఐదు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. మరో తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.40 వేల జరిమానా విధించారు. రౌతులపూడి పోలీసులు ఐదుగురిని తుని కోర్టులో హాజరు పరచగా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.40 వేల జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్య సేవించడం, మద్యం తాగి వాహనాలు నడపడం, రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించడం వంటి వాటిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు హెచ్చరించారు. వాహనచోదకులు బాధ్యతగా వ్యవహరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.

## విచారణ ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 13 : మనం న్యూస్ : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులపై నిర్వహిస్తున్న విచారణ (హియరింగ్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని నాయక్ నగర్లో ఉన్న 49వ సచివాలయం కిందనున్న 179, 180, 181 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా జరుగుతున్న విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో ప్రక్రియలో భాగంగా ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాలో పేర్ల సవరణలు, వ్యత్యాసాలు (అనామాలీస్ / డిస్క్రిపాన్సీస్ ) ఉన్న ఓటర్లకు బి ఎల్ ఓ ల ద్వారా ముందుగానే నోటీసులు అందజేయడం జరగగా, నోటీసులు అందుకున్న ఓటర్లకు సదరు వ్యత్యాసాలపై స్పష్టత కోసం ఏఈఆర్ఓ సమక్షంలో విచారణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం నగరం పరిధిలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, రద్దీ కాకుండా రోజువారీ షెడ్యూల్ ప్రకారం కేటాయించిన సమయాల్లోనే ఓటర్లు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విచారణ ప్రక్రియను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, టిపిఓ ఓంకార్ రెడ్డి, సంబంధిత బిఎల్ఓలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభం

- విద్యా క్రీడా రంగాల్లో ఆర్ డి టి సేవలు ఎంతో అమోగం
- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్ లు

మడకశిర,ఆగస్టు 13,మనం న్యూస్: విద్యా,క్రీడా రంగాల్లో ఆర్ డి టి స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో అమోగమని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్,జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ లు తెలిపారు.మడకశిర మండలం,పంచాయతీ కేంద్రమైన ఆర్.అనంతపురం ఆర్ డి టి ఏరియా కార్యాలయం ఆవరణంలో ఆర్ డి టి సౌజన్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్,ఎడ్యుకేషన్ కేంద్రం ను గురువారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య ఆతిథు లుగా జిల్లా కలెక్టర్,ఎస్పీ లతో పాటు ఆర్ డి టి పోగ్రామ్ డైరెక్టర్ మాంచ్ ఫెర్రర్ లు హాజరయ్యారు.వీరితో పాటు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీ నారాయణ తదితరులు కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో క్రీడా, విద్యా రంగాల అభివృద్ధికి ఆర్ డి టి మరో ముందడుగు వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడా, విద్యా రంగాల అభివృద్దే లక్ష్యంగా ఆర్ డి టి స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ సెంటర్ ను ప్రారంభించడం ఈ ప్రాంత విద్యార్థులకు,క్రీడా కారుల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్ డి టి ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు తదితరులు,ప్రజలు పాల్గొన్నారు.

## నటి శ్రీదేవీ బయోగ్రఫీపై కీలక అప్ డేట్..!

దిగ్గజ నటి శ్రీదేవి జయంతి సందర్భంగా నటి ప్రియాంక చోప్రా ఆమె జీవిత చరిత్ర పుస్తకానికి సంబంధించిన తాజా అప్ డేట్ ను పంచుకున్నారు. ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో 'ఎంప్రెస్- ది డెఫినిటివ్ బయోగ్రఫీ ఆఫ్ శ్రీదేవి' పుస్తక ముఖచిత్రాన్ని షేర్ చేస్తూ ఆమెకు నివాళులర్పించారు. 'మీరు ఎంతో గుర్తుకొస్తున్నారు. స్వర్గంలో ఉన్న మీకు జన్మదిన శుభాకాంక్షలు. శ్రీదేవి త్వరలో వస్తోంది' అని ప్రియాంక పేర్కొన్నారు. ఈ పోస్టును శ్రీదేవి భర్త బోనీ కపూర్ కూడా తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్నారు.



2023లో వెస్ట్ ల్యాండ్ బుక్స్ శ్రీదేవి అధికారిక జీవిత చరిత్రను ప్రచురిస్తున్నట్లు ప్రకటించింది. రచయిత ధీరజ్ కుమార్ రచించిన ఈ పుస్తకం శ్రీదేవి సినీ ప్రయాణం, వ్యక్తిగత జీవితం, ఆమె వదిలివెళ్లిన వారసత్వాన్ని తెలియజేయనుంది.

ఒకానొక సమయంలో భారతీయ సినీ పరిశ్రమను ఏలిన శ్రీదేవి.. 2018 ఫిబ్రవరి 24న దుబాయ్లో కన్నుమూశారు. బంధువు మోహిత్ మార్వా వివాహానికి హాజరైన సమయంలో ఆమెకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. 'మిస్టర్ ఇండియా', 'చాందినీ', 'హిమ్మత్వాలా' వంటి చిత్రాలతో ఆమె భారతీయ సినీ చరిత్రలో చెరగని ముద్ర వేశారు. తెలుగులోనూ స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

**శ్రీదేవి చివరి చిత్రం..**

శ్రీదేవి ప్రధాన పాత్రలో నటించిన చివరి చిత్రం 'మామ్' (2017). ఇది ఆమె కెరీర్ లో 300వ చిత్రం. దీనికి గాను ఆమెకు మరణానంతరం జాతీయ చలనచిత్ర పురస్కారం లభించింది. ఆమె మరణానంతరం విడుదలైన 'జీరో' (2018) చిత్రంలోనూ అతిథి పాత్రలో కనిపించారు.

## గంభీర్ ముక్కుసూటి మనిషి.. అందుకే నచ్చడం లేదేమో: హర్భజన్

టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పై వస్తోన్న విమర్శలను మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఖండించారు. ఏదైనా మ్యాచ్ లేదా సిరీస్ ఓడిపోతే వెంటనే కోచ్నే విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషి అని ప్రశంసించాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి నచ్చడం లేదేమోనని హర్భజన్ వ్యాఖ్యానించాడు. గంభీర్ కోచింగ్ లో మన జట్టు ఐసీసీ టోర్నీలను గెలిచిన విషయాన్ని గుర్తు చేశాడు.



''గంభీర్ ఎందుకు ఇంతలా విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే వెంటనే కోచ్ను నిందించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. అతడు క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచీ నాకు తెలుసు. ఆటపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ తొలినాళ్లలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతడికి మంచి స్నేహితులు. ఇప్పటికీ వారే ఫ్రెండ్స్ అనుకుంటా. అతడు ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడతాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి మింగుడుపడవు. కవర్ చూసి పుస్తకాన్ని ఎలాంటిదో నిర్ణయించకూడదని పెద్దలు అంటారు. పైకి అలా ఉండే గంభీర్ ను విమర్శించడమూ తప్పే. విజయం కోసమే ఆడాలి అని బలంగా నమ్మే కోచ్ అతడు. ఓటమిని కనీసం ఊహించడానికి కూడా ఇష్టపడడు. డ్రా కోసం వెళ్లేందుకూ సుముఖత వ్యక్తం చేయడు'' అని హర్భజన్ తెలిపాడు.

**శుభ్ మన్ సక్సెస్ వెనుక..**

''ఎవరికైనా సరే సక్సెస్ ఒక్కసారిగా వచ్చేయదు. శుభ్ మన్ గిల్ విషయంలోనూ అంతే. ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ లో అతడి కెప్టెన్సీని చూశాం. అతడి సత్తా మనందరికి తెలిసింది. బ్యాటర్ గా పరుగులు రాబట్టాడు. సారథిగా జట్టును బాగా నడిపించాడు. ప్రతి ప్లేయర్ కెరీర్ లో ఒడుదొడుకులు సహజమే. గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. వ్యక్తిగతంగానూ అతడు చాలా అద్భుతం'' అని హర్భజన్ ప్రశంసించాడు.

**పరుగులు చేస్తున్నారుగా..**

''లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఫుట్ బాల్ ఆడుతున్నారు. మరి విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వన్డేల్లో కొనసాగితే తప్పేంటి? ఏ ప్లేయర్కైనా సరే ప్రదర్శనే గీటురాయి. వయసు ముఖ్యం కాదు. విరాట్ వయసు 37 ఏళ్లు దాటినా.. ఇరవై ఏళ్ల కుర్రాడిలా మైదానంలో హుషారుగా ఉంటాడు. మెస్సిని ఆపాలంటే ఇప్పటికీ ఐదుగురు ప్లేయర్లు కష్టపడాలి. భారత జట్టులో ఫిట్ నెస్ కు సంబంధించి మార్పులు తీసుకొచ్చింది కోహ్లినే. చివరి రోజు 400 పరుగులు లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. ఒకవేళ ఇప్పుడు ఓటమి ఎదురైనా ఏదొక రోజు సాధించి తీరుతామని చెప్పేవాడు. వైభవ్ సూర్యవంశీ దూకుడు మనందరికీ తెలుసు. కానీ, విరాట్ - రోహిత్ కు అనుభవం ఉంది. వీరిద్దరు ఇప్పుడు ఎలా ఆడుతున్నారనేదే ముఖ్యం. ఇటీవల మ్యాచుల్లో ప్రదర్శన చూస్తే వీరిద్దరూ సఫలమైనట్లే'' అని హర్భజన్ వెల్లడించాడు.



## భారత్-అఫ్గానిస్తాన్ టీ20 సిరీస్ లో మార్పు!

సెప్టెంబర్ లో భారత్-అఫ్గానిస్తాన్ మధ్య మధ్య జరగాల్సిన మూడు టీ20ల సిరీస్ లో మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. ఇటీవల ఖరారైన షెడ్యూల్ ప్రకారం.. ఈ మూడు మ్యాచ్ లు వచ్చే నెల 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగాల్సి ఉంది. అయితే ఈ షెడ్యూల్ లో స్వల్ప మార్పు చేయాలని బీసీసీఐని అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు అభ్యర్థించినట్లు తెలుస్తోంది.

సెప్టెంబర్ 14న గణేష్ చతుర్థి పండగను పురస్కరించుకుని, ఆ రోజున ఒక టీ20 మ్యాచ్ నిర్వహించాలని ఏసీబీ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ రోజు పండగ సెలవు దినం కావడంతో మ్యాచ్ ను వీక్షించడానికి స్టేడియానికి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో వస్తారని అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఆశిస్తోంది.

ఈ ప్రతిపాదనకు భారత క్రికెట్ బోర్డు అంగీకరిస్తే.. సెప్టెంబర్ 13 లేదా 15న జరగాల్సిన మ్యాచ్ లలో ఒకదానిని సెప్టెంబర్ 14కి మార్చనుంది. కాగా ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ ప్రకారం ఇది అఫ్గానిస్తాన్ కు హోమ్ సిరీస్ కావడం విశేషం.

గతంలో అఫ్గాన్ జట్టు తన హోమ్ మ్యాచ్ లను భారత్ లో ఆడినప్పటికి, టీమిండియాతో హోమ్ సిరీస్ ఆడడం మాత్రం ఇదే తొలిసారి. ఈ చారిత్రత్మక సిరీస్ ప్రసార హక్కులకు సంబంధించి అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఇప్పటికే చర్చలు ప్రారంభించింది. సోనీ స్పోర్ట్స్, స్టార్ స్పోర్ట్స్ వంటి ప్రముఖ ఛానళ్లతో ఏసీబీ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

## కామాక్షి భాస్కర్ల – 'అగధ' చూసి కన్నీళ్లు పెట్టుకున్నాను..!

**వైవిధ్యమైన కథలతో రాణిస్తున్న కామాక్షి భాస్కర్ల హీరోయిన్గా నటించిన చిత్రం 'అగధ'. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్లో ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆగస్ట్ 14న విడుదలవుతోంది. శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, భాను చందర్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా విడుదల సందర్భంగా కామాక్షి భాస్కర్ల మీడియాతో పంచుకున్న విశేషాలు ఇవే.**

**శ్యాంప్రసాద్ రెడ్డి గారు మిమ్మల్ని అనుష్కతో పోల్చారు? దానిపై మీ స్పందన ఏంటి?**

అంత పెద్ద నిర్మాత నన్ను అనుష్క గారితో పోల్చడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మాటలు నాపై మరింత బాధ్యతను పెంచాయి.

**'అగధ'లోని యాక్షన్ సీక్వెన్స్ గురించి చెప్పండి?**

'అగధ'లో యాక్షన్ సీన్స్ కోసం ముందే వర్క్ షాప్స్, రిహార్సల్స్ చేశాం. సెట్లో చిన్న ఇబ్బందులు ఉన్నా, టీం వర్క్ వల్ల అవుట్ పుట్ బాగా వచ్చింది.

**'అగధ' జర్నీలో మీరు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?**

మహాదేవి పాత్రలోకి మారడం నాకు పెద్ద సవాలు. కామాక్షిని, నా ఆలోచనలని పక్కనపెట్టి ఆ పాత్రగా మారడానికి బుద్ధిజం పుస్తకాలు చదివి, బ్లాక్ మ్యాజిక్, ముద్రలు మరియు నడక శైలిపై రీసెర్చ్ చేశాను. దేవుడి అనుగ్రహంతో దక్కిన ఈ పాత్రలో ఎక్కడా కామాక్షి కనిపించకుండా నటించాను.

**ఎం.ఎస్. రాజు గారి నుంచి ఫోన్ రావడం ఎలా అనిపించింది?**

నాకు ఎం.ఎస్. రాజు గారి సినిమాలంటే చాలా ఇష్టం, అందులో 'మనసంతా నువ్వే' నా ఆల్ టైమ్ ఫేవరెట్. ఆయన నన్ను 'పొలిమేర'లో చూసి 'అగధ' కోసం కాంటాక్ట్ చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. ఆయన సినిమాల్లో ప్రతి పాత్ర చాలా పవర్ఫుల్గా ఉంటుంది.

**'అగధ'ను అంగీకరించడానికి మీకు నచ్చిన అంశాలు ఏంటి?**

రాజు గారి నుంచి పిలుపు వచ్చిందంటేనే అందులో కొత్త పాయింట్, బలమైన పాత్ర ఉంటాయని అర్థమైంది. అందుకే కథ వినకముందే ఆయనపై నమ్మకంతో ఓకే చెప్పేశా. తర్వాత 'అగధ' కథ, నా క్యారెక్టర్ విన్నాక ఇంకా బాగా నచ్చాయి. ఫలితాల కంటే వర్క్ ప్రాసెస్సు, రాజు గారితో పనిచేసే అనుభవాన్ని ఆస్వాదించడానికే ఈ సినిమా చేశాను.

**'అగధ'లోని హారర్, థ్రిల్లింగ్ మూమెంట్స్ గురించి చెప్పండి?**

'అగధ'లో హారర్ కంటే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, డివైన్ మూమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. సినిమా చివర్లో ప్రేక్షకులకు ఒక మంచి డివైన్ ఫీలింగ్ కలుగుతుంది.

**టెక్నికల్ టీం గురించి చెప్పండి?**

నాని చమిడిశెట్టి గారి కెమెరా వర్క్, ఆయన చేసిన ప్రయోగాలు రాజు గారి విజన్కి ప్రాణం పోశాయి. డీఐ వర్క్ చాలా బాగుంది. రాజీవ్ గారి ఆర్ట్ వర్క్, అమ్మవారి విగ్రహం సెట్స్ తెరపై మ్యాజిక్లా అనిపిస్తాయి. ఇక రీ-రికార్డింగ్ అయితే కొన్ని సీన్స్ని నెక్స్ట్ లెవెల్కి తీసుకెళ్లింది.

**మున్ముందు దర్శకత్వం వహించే అవకాశం ఉందా?**

ఇంతకుముందు నేను అసిస్టెంట్ డైరెక్టర్గా, అసోసియేట్ డైరెక్టర్గా, రైటింగ్ టీంలోనూ పనిచేశాను. దర్శకత్వం వహించాలనే ఆలోచన ఉంది కానీ, దానికి ఇంకా చాలా టైమ్ పడుతుంది.

**'అగధ' విజయంపై మీకున్న నమ్మకం గురించి చెప్పండి?**

'అగధ' ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. ముఖ్యంగా రాజు గారి కంబ్యాక్ కోసం ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవ్వాలి. నేను ఆల్రెడీ సినిమా చూశాను; సెట్లో సాధారణంగా అనిపించిన సీన్స్ కూడా స్క్రీన్ మీద అద్భుతంగా వచ్చి నన్ను ఆశ్చర్యపరిచాయి. సినిమా చూస్తున్నంతసేపూ భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చాయి, ఆఖరిగా ఎంతో సంతృప్తిగా అనిపించింది.



## జై హనుమాన్ కోసం శ్రీరాముడు కావలెను..

### ప్రశాంత్ వర్మ మైండ్‌లో ఉన్న హీరో ఎవరు?

యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ యూనివర్స్ నుంచి రాబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 'జై హనుమాన్'. 2024 సంక్రాంతి స్పెషల్ గా వచ్చిన 'హనుమాన్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవడంతో ఇప్పుడు దీనికి సీక్వెల్ గా తెరకెక్కుతోన్న 'జై హనుమాన్'పై భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే.. హనుమాన్ చిత్రంలో రాముడి పాత్ర లేనప్పటికీ.. జై హనుమాన్ లో మాత్రం రాముడి పాత్ర రావాల్సి ఉంది. దీంతో ఈ సినిమాలో రాముడి పాత్ర కోసం ఎవరిని తీసుకుంటారు అనే దానిపై ప్రజెంట్ సస్పెన్స్ నెలకొంది. ఈ క్రమంలోనే తాజాగా రాముడి పాత్రకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతున్నది. నెట్టింట వైరల్ అవుతున్న సమాచారం మేరకు..



జై హనుమాన్ సినిమాలో రాముడి ఎపిసోడ్ కు కీలకమైన స్థానం ఉందట. ఆ పాత్ర కోసం స్టార్ హీరోల్ని సంప్రదించే పనిలో ఉన్నాడట డైరెక్టర్ ప్రశాంత్ వర్మ. ఆయన మైండ్ లో చాలా పెద్ద హీరోలు ఉన్నారని తెలుస్తుంది. రాముడి పాత్ర, అందులోనూ హనుమాన్ ఫ్రాంచైజీ అంటే.. హీరోలు మెగ్గు చూపించే చాన్స్ ఉంది. కానీ, వచ్చిన సమస్య ఏంటేంటే.. ఎంత కాదన్నా 'జై హనుమాన్' సినిమా అనగానే ఇది రిషబ్ శెట్టి సినిమాగానే చలామణీ అవుతుంది కాబట్టి.. గెస్ట్ రోల్ అవసరమా? అని కూడా ఆలోచించొచ్చు. దీంతో రాముడి పాత్రకు టాలీవుడ్ హీరోల్ని ఒప్పించడం కష్టమే అవుతుండగా.. ఈ పాత్ర కోసం కన్నడ నుంచే ఓ హీరోని ఒప్పిస్తాడా? లేదా రాముని పాత్రను పూర్తిగా ఏఐలో డిజైన్ చేస్తారా అనేది ప్రశాంత్ వర్మ ఆలోచనపై ఆధారపడి ఉంది. ఏదిఏమైనప్పటికీ ప్రస్తుతం ఈ వార్త మాత్రం నెట్టింట వైరల్ అవుతున్నది.



## నేను బరువు తగ్గను..

### ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన స్వరా భాస్కర్

బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ తనను దారుణంగా ట్రోల్ చేస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పారు. పెళ్లై, పాప పుట్టిన తర్వాత ఆమె కాస్త లావు అవ్వడంతో కొంతమంది నెటిజన్లు ఆమె రూపంపై దారుణమైన కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. ఈ విషయంపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన స్వరా, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒకరి బరువు గురించి మాట్లాడటానికి మీకు అంత ఖాళీ సమయం ఉందా అని స్వరా ప్రశ్నించారు. 'నా జీవితం మీ మాటలపై నడవదు. అందంగా కనిపించే అమ్మాయిలను చూడాలనుకుంటే వేరే పేజీలు చూసుకోండి, నా ప్రొఫైల్ కు రావాలని మిమ్మల్ని ఎవరూ అడగలేదు' అని తెగేసి చెప్పారు. ఒక మహిళ తల్లి అయిన తర్వాత ఆమె శరీరంలో మార్పులు రావడం చాలా సహజమని గుర్తుచేశారు.

సినిమాలో ఎప్పుడూ అందంగా కనిపించాలని సర్జరీలు, ఇంజెక్షన్లు చేయించుకోవడం సాధారణమే కావచ్చు కానీ, కాలంతో పాటు మన రూపురేఖలు మారడం సహజమని చెప్పారు. గతంలో తన భర్త ఫహద్ తో కలిసి బయటకు వెళ్లినప్పుడు మేకప్ లేకుండా ఉన్న ఫోటోలను కావాలనే వైరల్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే మతం ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవడం వల్లే ఇలా అయ్యానంటూ కొందరు కామెంట్లు చేశారని, అది తన భర్తను కూడా బాధించిందని చెప్పారు. అయితే ఇలాంటి కామెంట్లకు తాను భయపడేది లేదని స్వరా స్పష్టం చేశారు. 'మీరు విమర్శిస్తున్నారని నేను బరువు తగ్గను, పైగా ఇంకా లావుగా ఉన్న ఫోటోలనే సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాను' అని సవాల్ విసిరారు. ఆడవాళ్లు ఏ రంగంలో ఉన్నా ఇలాంటి సమస్యలను తట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.